


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 08 జనవరి 2022 సంపుటి: 03 సంచిక: 131 పేజీలు: 4 వెల: రూ 3-00


## ప్రధాని భద్రతా వైఫల్యంపై సుప్రీంలో విచారణ



న్యూఢిల్లీ, జనవరి 7, (న్యూస్ పల్స్)ప్రధానమంత్రి నరేంద్రమోడీ భద్రతలో లోపంపై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ నేతృత్వంలోని న్యాయమూర్తులు సూర్యకాంత్, హిమా కోహ్లీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ ధర్మాసనం ముందు ప్రధానమంత్రి భద్రతలో లోపాన్ని సీనియర్ న్యాయవాది మణిందర్ సింగ్ లేవనెత్తారు. విచారణ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ.. రాష్ట్రం, కేంద్రం రెండూ కమిటీలు వేసుకున్నాయని.. విచారణ అనుమతిపై ప్రశ్నించారు. అప్పుడు సీజేఐ మాట్లాడుతూ.. రాష్ట్ర, కేంద్ర కమిటీలు తమ పనిని ఆపాలని, మేము దీన్ని ఆర్డర్‌లో నమోదు చేయడం లేదని, అయితే రెండు కమిటీలకు తెలియజేయాలని అన్నారు. శుక్రవారం నాటి కీలక పరిణామంలో, ప్రధాని మోడీ పంజాబ్ పర్యటనకు సంబంధించిన ప్రయాణ రికార్డులను భద్రపరచాలని, భద్రపరచాలని పంజాబ్, హర్యానా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రధాని మోడీ భద్రతా ఉల్లంఘనపై న్యాయ విచారణ కోరుతూ 'లాయర్స్ వాయిస్' అనే సంస్థ వేసిన పిటిషన్‌ను సీజేఐ ఎన్వీ రమణ, న్యాయమూర్తులు హిమా కోహ్లీ, సూర్యకాంత్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. చరణ్‌జిత్ సింగ్ చన్నీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే భద్రతా లోపాన్ని గమనించి, ఈ అంశంపై స్వతంత్ర విచారణ జరిపి పంజాబ్ చీఫ్ సెక్రటరీ అనిరుధ్ తివారీ, డిజిపి సిద్ధార్థ్ ఛటోపాధ్యాయలను సస్పెండ్ చేయాలని కోరింది. కేంద్రం, పంజాబ్ ప్రభుత్వ విచారణ కమిటీ సోమవారం విచారణ వరకు ప్రక్రియను కొనసాగించదు. చండీగఢ్ డీజీతో పాటు ఎన్ఐఏ అధికారిని నోడల్ అధికారులుగా సుప్రీంకోర్టు నియమించింది. ప్రధానమంత్రి భద్రతపై సీరియస్‌గా ఉన్నామని.. రాష్ట్ర, కేంద్రం తమ సొంత కమిటీని పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. పంజాబ్ హర్యానా హైకోర్టు రిజిస్ట్రార్ రికార్డులను భద్రపరచాలని ఆదేశించినట్లు సుప్రీంకోర్టు తెలిపింది. అంటే ప్రధాని మోదీ వెళ్లే రూట్‌కు సంబంధించిన మొత్తం సమాచారాన్ని భద్రంగా ఉంచాలని కోరింది. రిజిస్ట్రార్ జనరల్‌కు అవసరమైన సమాచారాన్ని అందించాలని పంజాబ్ ప్రభుత్వం, పంజాబ్ పోలీసులు, ఎస్‌పిజి, ఇతర ఏజెన్సీలను కూడా కోర్టు కోరింది. ఎన్ఐఏ కూడా సహకరించాలని కోరింది.

పిటిషనర్ తరపు న్యాయవాది..

మరోవైపు, పిటిషనర్ తరపు న్యాయవాది మణీందర్ సింగ్ మాట్లాడుతూ.. ఇది కేవలం శాంతిభద్రతల సమస్య కాదని, ఎస్‌పిజి చట్టం ప్రకారం సమస్య అని అన్నారు. ఇది చట్టబద్ధమైన బాధ్యత అని సింగ్ అన్నారు. ఇందులో ఎలాంటి సంకోచం ఉండదు. ఇది జాతీయ భద్రతా సమస్య, కేవలం శాంతిభద్రతలే కాదు. రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధమైన స్థాయిలో కట్టుబడి ఉండాలి.

## ఎట్టకేలకు ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకటించిన ఏపీ సర్కార్



అమరావతి: ఉద్యోగుల నిరీక్షణకు తెరదించుతూ ప్రభుత్వం పీఆర్‌సీ ప్రకటించింది. గత కొన్ని నెలలుగా జరుగుతున్న సుదీర్ఘ చర్చల అనంతరం ఎట్టకేలకు ప్రభుత్వం పీఆర్‌సీపై నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు 23.29 శాతం పీఆర్‌సీ ఇస్తున్నట్టు సీఎం జగన్ ప్రకటించారు. ఉద్యోగ సంఘాలతో సమావేశమైన సీఎం ఈమేరకు ప్రభుత్వ నిర్ణయాలను వెల్లడించారు. పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఉద్యోగులకు ఊహించని వరమిచ్చారు. పెంచిన జీతాలు 2022 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. పెండింగ్ డీఏలు జనవరి నుంచి చెల్లిస్తామని, 2020 ఏప్రిల్ నుంచి కొత్త పీఆర్సీ అమల్లోకి వస్తుందని సీఎం చెప్పడంతో ఉద్యోగ సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేశారు. "కొవిడ్, ప్రతికూల పరిస్థితుల కారణంగా రాష్ట్ర ఆదాయం తగ్గింది. అన్నీ పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి. మంచి చేయాలనే తపనతోనే ప్రతి అడుగూ వేస్తున్నాం. సంక్షేమం, అభివృద్ధి సజావుగా సాగాలంటే ఉద్యోగుల పాత్ర ముఖ్యం. ఫిట్‌మెంట్ 14.29 శాతం కన్నా ఎక్కువ ఇచ్చే పరిస్థితి లేదని అధికారుల కమిటీ చెప్పింది. అయినా.. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్తున్నాం" అని సీఎం వెల్లడించారు. ఈ నిర్ణయాల వల్ల ఏడాదికి ప్రభుత్వంపై రూ.10,247 కోట్ల అదనపు భారం పడుతున్నప్పటికీ, ఉద్యోగులకు మంచి చేయాలని ఈ బాధ్యతను స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాల పట్ల ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం జగన్ ఏం చెప్పారంటే...

సీఎస్‌తో కూడిన అధికారుల కమిటీ 14.29శాతం మించి ఫిట్‌మెంట్ ఇవ్వలేమని చెప్పింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితులను, సమస్యలను అన్నికోణాల్లో క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఒక వాస్తవికమైన ఫిగర్‌ను వారు చెప్పినప్పటికీ... అటు ఉద్యోగుల ఆకాంక్షలను, ఇటు రాష్ట్ర వాస్తవ ఆర్థిక పరిస్థితిని బేరీజు వేసుకుని, ఉద్యోగులకు వీలైనంత మంచి చేయాలన్న తపన, తాపత్రయంతో ఫిట్‌మెంట్‌ను 23శాతంగా నిర్ణయించాం. అధికారుల కమిటీ చెప్పిన 14.29శాతం కన్నా దాదాపు 9శాతం పెంచి ఫిట్‌మెంట్ ఇస్తున్నాం.

సీఎస్‌తో కూడిన అధికారుల కమిటీ 2022 అక్టోబరు నుంచి కొత్త పీఆర్సీ ప్రకారం సవరించిన జీతాలు ఇవ్వాలని ప్రతిపాదించినప్పటికీ, ఉద్యోగుల ఆకాంక్షల మేరకు 10 నెలల ముందే, అంటే జనవరి 1, 2022 నుంచే పీఆర్సీని అమలు చేసి, దాని ప్రకారం జీతాలు ఇవ్వాలని ఆదేశించినట్టు సీఎం తెలిపారు.

2020 ఏప్రిల్ నుంచే మానిటరీ బెన్‌ఫిట్.

ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంపు. 1- 1-2022 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు జూన్ 30లోపు ప్రొబేషనరీ, కన్ఫర్మేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాం. సవరించిన విధంగా రెగ్యులర్ జీతాలను (న్యూ పేస్కేలు) ఈ ఏడాది జులై జీతం నుంచి ఇవ్వాలని ఆదేశించాం. కొవిడ్‌తో మరణించిన ఉద్యోగుల కుటుంబాల్లో కారుణ్య నియామకాలు జూన్ 30లోపు పూర్తి చేస్తాం. ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్యను రెండు వారాల్లో పరిష్కరిస్తాం. సొంత ఇల్లు లేని ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం రిబేటుతో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లలో ఇళ్లు కేటాయింపు. 10 శాతం ప్లాట్లు ఉద్యోగులకు రిజర్వ్ చేస్తాం. నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుంటాం. ఉద్యోగులు ఎవ్వరికీ కూడా ఇంటిస్థలం లేదనే మాట లేకుండా చూస్తాం. ఆ రిబేటును కూడా ప్రభుత్వం భరిస్తుంది. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు, పీఎఫ్, జీఎల్ఐ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితరాలన్నీ కూడా ఏప్రిల్‌నాటికి పూర్తిగా చెల్లించాలని ఆదేశించాం. పీఆర్సీ అమలు చేసేనాటికి పెండింగ్ డీఏలు ఉండకూడదని స్పష్టంగా చెప్పినమీదట, పెండింగులో ఉన్న అన్ని డీఏలను ఒకేసారి జనవరి జీతంతో కలిపి ఇవ్వాలని ఆదేశించాం. కొత్త స్కేల్స్‌ను, రెగ్యులర్ ఉద్యోగులతో పాటు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా మేలు చేయాలనే ఉద్దేశంతో వారికి కూడా 2022 జనవరి జీతాలతోనే అమలు చేయాలని నిర్ణయించాం. సీపీఎస్‌కు సంబంధించి టైంలైన్ పెట్టుకోవాలి. ఇప్పటికే కేబినెట్ సబ్‌కమిటీ వేశాం. జూన్ 30లోగా ఒక నిర్ణయం తీసుకుంటాం. అని సీఎం వెల్లడించారు.

ఉద్యోగుల సొంతింటి కల నెరవేరనుంది: బొప్పరాజు

రెండు వారాల్లో హెల్త్ కార్డుల సమస్య పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారని అమరావతి ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. సీఎంతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ఉద్యోగుల సొంతింటికల నెరవేర్చేలా సీఎం నిర్ణయం తీసకున్నారు. స్మార్ట్ సిటీలో ఉద్యోగుల ఇంటి నిర్మాణానికి 20శాతం రాయితీ ఇస్తామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ఒకటో తేదీకే జీతాలు ఇస్తామన్నారు. సీపీఎస్ అంశంపై టైమ్ బౌండ్ ప్రకటించారు. ఫిట్ మెంట్ సమస్య మినహాయిస్తే.. మిగిలిన అన్ని సమస్యలపై సీఎం .. టైమ్ బౌండ్ ప్రకటించడం మంచి నిర్ణయమే" అని బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు.

## సీఎం జగన్ పీఆర్సీ ప్రకటనపై ఉద్యోగ సంఘాల హర్షం




అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం సంతోషకరమైన నిర్ణయమని ఉద్యోగ సంఘాల నేత వెంకట్రామిరెడ్డి తెలిపారు. తాము అనుకున్న దానికంటే ఎక్కువే చేసినందున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ జనవరి జీతం నుంచే పెంచిన పీఆర్సీ, ఐదు డీఏలు ఇస్తామడం మంచి బెనిఫిట్ అనిపేర్కొన్నారు. ఏప్రిల్ లోపు పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేస్తామని సీఎం హామీ ఇచ్చారని, ఇది ఉద్యోగులకు మంచి పరిణామమన్నారు. రిటైర్మెంట్ వయసు తగ్గిస్తున్నారంటూ కొందరు వాట్సప్ గ్రూపులో దుష్ప్రచారం చేశారని గుర్తు చేశారు. కరోనా వల్ల రెండు సంవత్సరాలు ఆర్థిక సమస్యలు తలెత్తాయని, తాము కూడా అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరిస్తామని పేర్కొన్నారు. ఇళ్లు లేని ఉద్యోగులకు టౌన్ షిప్‌లో పది శాతం కేటాయిస్తామన్నారని, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా జీతాలు పెరుగుతాయని సీఎం తెలిపినట్లు పేర్కొన్నారు. కాగా ప్రభుత్వ ఉద్యోగులకు 23.29 శాతం పీర్సీని ప్రకటిస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. పెంచిన జీతాలు 2022 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయని ప్రభుత్వం తెలిపింది. పెండింగ్ డీఏలు జనవరి నుంచి చెల్లించనున్నారు. 2020 ఏప్రిల్ నుంచి కొత్త పీఆర్సీ వర్తిస్తుంచనుంది. తాజా నిర్ణయంతో ప్రభుత్వంపై రూ.10,247 కోట్ల అదనపు భారం పడనుంది.

## నేను కుప్పం వదిలి ఎందుకు వెళ్లాలి?: చంద్రబాబు




చిత్తూరు జిల్లా: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రెండో రోజు శుక్రవారం కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "రాష్ట్రం వైసీపీ జాగీరా? మీకు రాష్ట్రాన్ని రాశిచ్చారా? అయిదేళ్ల చరిత్రలో నిలిచిపోయేలా పరిపాలించాలి.. జగన్ రాష్ట్ర వినాశకారుడిగా మారాడు. నేను కుప్పం వదిలి ఎందుకు వెళ్లాలి? వీళ్లకు భయపడుతాననుకుంటున్నారా?" అంటూ ధ్వజమెత్తారు. తానొక విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే.. వైసీపీ అధికారంలోకి వచ్చి నాశనం చేసిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అప్పులకు... సంక్షేమ పథకాలకు సంబంధం ఉందా? అని ప్రశ్నించారు. వైసీపీ కార్యకర్తల్లోనూ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. కుప్పం నుంచే ఈ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిస్తున్నానన్నారు. పొత్తులు అనేవి ఎన్నికల్లో భాగమని, పరిస్థితులను బట్టి పొత్తులు అనేది కొనసాగుతాయన్నారు. తాము గతంలో పొత్తు లేకుండా కూడా గెలిచామని చంద్రబాబు పేర్కొన్నారు.

## ఏపీలో హై అలెర్ట్

విజయవాడ, జనవరి 7, (న్యూస్ పల్స్)జస్ట్ ఎనిమిదే ఎనిమిది రోజులు. ఏడు నెలల రికార్డును తుడిచి పెట్టేసింది. అవును ఇది ఇండియాలో ఏడు నెలల తర్వాత డైలీ కరోనా కేసుల పరిస్థితి. దీంతో ఏపీ సర్కార్ అలర్ట్ అయ్యింది. జగన్ సర్కార్ వైద్య రంగాన్ని అప్రమత్తం చేసింది. ప్రత్యేకంగా కోవిడ్ హాస్పిటల్స్ పై దృష్టి సారించింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో అన్ని జిల్లాల వైద్య అధికారులను వైద్య ఆరోగ్య శాఖ అలర్ట్ చేసింది. ఏపీ వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కోవిడ్ కేర్ సెంటర్లు అప్రమత్తమయ్యాయి. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో బెడ్లు, ఆక్సిజన్ కొరత ఉండకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఏపీ రాష్ట్రవ్యాప్తంగా కోవిడ్ కి చికిత్స అందించే ఆస్పత్రులు వివరాలు ఇవే..మొత్తం కోవిడ్ ఆస్పత్రులు 236ఐసీయూ బెడ్‌లు మొత్తం 3609నిండిన బెడ్లు 87, ఖాళీలు 3522ఆక్సిజన్ కలిగిన ఐసియు బెడ్ లు మొత్తం 15,962నిండిన బెడ్లు 184,ఖాళీలు 15,778జనరల్ బెడ్లు మొత్తం 11277నిండినవి 66, ఖాళీలు 11211వెంటిలేటర్లు మొత్తం 1690నిండినవి 14 ఖాళీలు 1676

## మార్చిలో పదో తరగతి పరీక్షలు

### మంత్రి ఆదిమూలపు సురేష్



గుంటూరు: ఏపీలో పదో తరగతి పరీక్షలు మార్చిలో నిర్వహిస్తామని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. సంక్రాంతి నాటికి సిలబస్ పూర్తి చేయాలని విద్యాసంస్థలకు సూచించారు. 15 నుంచి 18 ఏళ్ల లోపు విద్యార్థులకు ప్రతి స్కూల్లో 95% వ్యాషినేషన్ పూర్తి చేశామని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో అమ్మఒడి మూడో విడత ఇస్తామని పేర్కొన్నారు. నిబంధనలు పాటించని బీఈడీ, డీఈడీ కాలేజీలు 375 మూతపడ్డాయని మంత్రి సురేష్ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రైవేటు యూనివర్సిటీలో చట్టసవరణ ద్వారా 35% ఫ్రీ సీట్లు ఇప్పించామని పేర్కొన్నారు. సంక్షేమం రెండు కళ్ళుగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఏ విద్యార్థి డబ్బులు లేక విద్యకు దూరం కాకూడదని అమ్మఒడి ఇచ్చి విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్‌తో పాటు మధ్యాహ్నం పౌష్టికాహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ఇంగ్లీష్ మీడియం చెప్తూ తెలుగు కూడా బోధిస్తున్నామన్నారు.

## ఏపీలో పార్టీపై షర్మిల స్పందన

అమరావతి: ఏపీలో పార్టీపై వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల స్పందించారు. శుక్రవారం షర్మిల మీడియాతో మాట్లాడుతూ ఎవరైనా ఎక్కడైనా పార్టీ పెట్టొచ్చని, అదే విషయం తాను చెప్పానని తెలిపారు. తన బతుకు ఇక్కడే ముడిపడి ఉందన్నారు. వైఎస్ఆర్‌ని ప్రేమించిన ఈ ప్రజలకు సేవ చేయడానికే.. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ పుట్టిందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల కోసమే ఇక్కడ పార్టీ పెట్టానని, రాజకీయాల్లో ఎప్పుడు ఏదైనా జరగొచ్చని జోస్యం చెప్పారు. అధికారంలో ఉంటాను అనుకోవడం మూర్ఖత్వమని వ్యాఖ్యానించారు. అధికారంలో లేనివారు.. అధికారంలోకి రారనుకోకూడదని, పాలిటిక్స్ అంటేనే అప్ అండ్ డౌన్ ఉంటాయని షర్మిల వ్యాఖ్యానించారు. కొంత కాలంగా తన సోదరుడు సీఎం జగన్ తీరుపై షర్మిల ఆగ్రహంగా ఉన్నారు.



మొన్న పులివెందుల వెళ్లినప్పుడు కూడా జగన్, షర్మిల మధ్య వాగ్వాదం జరిగిందనే వార్త గుప్పుమంది. అంతేకాదు జగన్ ఏపీలో ఉండి ఇక్కడ తెలంగాణలో తనకు నష్టం కలిగిస్తున్నారని షర్మిల అభిప్రాయం పడుతున్నట్లు సమాచారం. వాటన్నింటికి తెరదించేలా ఏపీలో కూడా షర్మిల పార్టీ పెడతారంటూ ప్రచారం జరుగుతోంది.


# సంపాదకీయం

శనివారం 08 జనవరి 2022

## ముంగిట్లో మూడో విడత ముప్పు

ఒకింత భయం?. దానికి తోడు ఆ.. ఏం అవుతుందిలే అన్న నిర్లక్ష్యం వెరసి యావత్ ప్రపంచం కరోనా థర్డ్ వేవ్ ముంగిట వాలనే వాలింది. ప్రతీ రోజు లక్షల్లో కేసులు నమోదవుతుండడంతో అగ్రరాజ్యం అమెరికా వణికిపోతోంది. వారం రోజుల క్రితం రెండు, మూడు వేల కేసులకే రోజూ వారీ సంఖ్య నమోదైన మన దేశం.. ఉన్నట్లుండి ప్రతీరోజు లక్షకు చేరువలో కేసులు నమోదయ్యే ప్రమాదకరమైన పరిస్థితికి చేరుకుంది. దేశంలో థర్డ్ వేవ్ ముప్పు ముంచుకొచ్చింది అనడానికి ఈ గణాంకాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. మళ్లీ లాక్‌డౌన్ తప్పదా..? ఈప్రశ్న ఇపుడు చాలా మందిని భయభ్రాంతులకు గురిచేస్తోంది. సగం మంది జనాభా కరోనాకు బలైపోవడం ఖాయమా? అన్న భయాందోళన వ్యక్తమవుతోంది. ఇంతకు ముందెన్నడు చూడని అత్యంత ఘోర విపత్తును చూడబోతున్నామా? రానున్న రెండు నెలల్లో ఏం జరగబోతోంది? దేశంలో అంతకంతకూ రెట్టింపవుతున్న కరోనా.. ఒమిక్రాన్ కేసులు టెన్షన్ పెడుతున్నాయి.. మరోవైపు న్యూ వేరియంట్ ఒమిక్రాన్ విలయం సృష్టిస్తోంది. రాకెట్ వేగంతో విస్తరిస్తోంది. కేసులు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దేశవ్యాప్తంగా ఒమిక్రాన్ కేసులు మూడువేలకు చేరువయ్యాయి. ముఖ్యంగా వాణిజ్య రాజధాని ముంబయిలో కరోనా కోరలు చాచింది. జనవరి 5వ తేదీన ఒక్కరోజే 18వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. దాంతో 653కు చేరాయి ఒమిక్రాన్ కేసులు. జనవరి 6న సాయంత్రం వెల్లడైన గణాంకాల ప్రకారం ముంబయి నగరంలో 20వేలకు పైగ కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్ర తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో 382మందికి ఒమిక్రాన్ నిర్ధారణ అయింది. కేసులు పెరుగుతుండటంతో వీకెండ్ కర్ఫ్యూ విధించింది ఢిల్లీ సర్కార్.ఇక కర్నాటకలోనూ ఒమిక్రాన్ కల్లోలం సృష్టిస్తోంది. ఒకేరోజు 149 న్యూ వేరియంట్ కేసులు వెలుగులోకొచ్చాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 226కు చేరింది. కేసులు పెరుగుతుండటంతో అప్రమత్తమైన ప్రభుత్వం..వీకెండ్ కర్ఫ్యూ విధించింది. మెడికల్ కాలేజీలు మినహా అన్ని కాలేజీలు బంద్ చేసింది. 1 నుంచి 9తరగతుల వారికి ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తోంది. ఇక జమ్ము వైష్ణోదేవి యూనివర్సిటీలోనూ కరోనా కలకలం రేగింది. 140 మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ఒమిక్రాన్ వ్యాప్తితో గత కొన్ని రోజులుగా దేశంలో కొత్త కేసులు అమాంతం పెరుగుతున్నాయి. మూడో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో వచ్చే రెండు వారాలు అత్యంత కీలకమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అందరూ అనుకుంటున్నట్టు ఒమిక్రాన్ సాధారణ జలుబు లాంటి వ్యాధి కాదు. ఆరోగ్య వ్యవస్థలపై ఇది తీవ్ర ప్రభావం చూపించొచ్చు. కేసులు అకస్మాత్తుగా, భారీ సంఖ్యలో పెరుగుతున్నాయి. పరీక్షలు చేయడం, రోగులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, ప్రజలకు అవగాహన కల్పించడం చాలా ముఖ్యం అని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరిస్తోంది. భారత్‌లో కేసుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని, వచ్చే రెండు వారాల్లో గరిష్ఠ స్థాయికి చేరొచ్చని డబ్ల్యూహెచ్‌వో భిప్రాయపడింది.కరోనా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా కేసుల్లో పెరుగుదల భయపెడుతోంది. దేశవ్యాప్తంగా గురువారం ఉదయం వరకు రెండున్నర వేలకు పైగా ఒమిక్రాన్ కేసులు నమోదయ్యాయి. ఢిల్లీ-ముంబై వంటి పెద్ద నగరాల్లో కేసులు తెరపైకి వస్తున్నాయి. ఎపిడెమియాలజిస్ట్ చంద్రకాంత్ లహరియాచెబుతున్నదాని ప్రకారం.. ఈ నగరాల్లో రాబోయే 3-4 వారాలు ఉద్రిక్తంగా ఉంటాయి. ఆ తర్వాత కేసులు పూర్తిగా తగ్గుముఖం పడతాయి. ఇక్కడ కేసులు తక్కువగా ఉన్నప్పుడు, చిన్న నగరాల్లో వేగంగా అభివృద్ధి చెందుతాయి .. రాబోయే 3-4 వారాలు చిన్న నగరాల్లో కేసులు ఆందోళన కలిగిస్తాయి. ఈ నగరాల తర్వాత, వైరస్ గ్రామాల్లో విధ్వంసం సృష్టించవచ్చు.ఒమిక్రాన్ నమూనా మొదటి 3-4 వారాలలో చాలా వేగంగా విస్తరిస్తుంది అని సూచిస్తుంది.. తరువాత అకస్మాత్తుగా ఆగిపోతుంది అని లహరియా చెప్పారు.దీంతో వ్యాధి సోకిన రోగులంతా ఆస్పత్రిలో చేర్పించేందుకు ఇబ్బందులు పడకపోవడం ఊరటనిచ్చే అంశం. ఉదాహరణకు, ముంబైలో ఓమిక్రాన్ సోకిన 10 మంది రోగులలో 9 మంది లక్షణం లేనివారు.అంటే, దీని అర్థం లక్షణాలు 10 మందిలో ఒకరికి మాత్రమే కనిపిస్తాయి, అవి కూడా తేలికపాటివి. సోకిన వారిలో ఎక్కువ మంది ఇంట్లోనే కోలుకుంటున్నారు. అయితే, టీకాలు వేయని వారికి ఇది మరింత హాని కలిగిస్తుంది.చంద్రకాంత్ లహరియా ఇంకా మాట్లాడుతూ, 23 మార్చి 2020న మొదటి లాక్‌డౌన్ సమయంలో, మేమనం 10,180 ఐసోలేషన్ పడకలు .. 2,168 ఐసియు పడకల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాము. ఇప్పుడు దాదాపు ఒక సంవత్సరం తర్వాత, మేము 18,03,266 ఐసోలేషన్ పడకలు .. 1,24,598 ఎఅజ పడకల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాము. పీఎం కేర్స్ .. కోవిడ్-19 ఎమర్జెన్సీ రెస్పాన్స్ అండ్ హెల్త్ సిస్టమ్ ప్రిపేర్డ్‌నెస్ ప్యాకేజీ-ఎఎ ద్వారా రాష్ట్రాలకు 1.14 లక్షల ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు. 1374 ఆసుపత్రుల్లో 958 లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ స్టోరేజీ ట్యాంకులు, మెడికల్ గ్యాస్ పైప్‌లైన్ సిస్టమ్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి.అయితే, ప్రభుత్వ డేటా ప్రకారం కూడా 1 వేల మందికి 1.4 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి .. 1445 మందికి 1 వైద్యుడు అందుబాటులో ఉన్నారు. 31 మార్చి 2020 నాటికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (ఖఊఅ) 6.8 అల్లోపతి వైద్యుల కొరత ఉంది. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 76.1% నిపుణుల కొరత ఉంది.డెల్టా వేరియంట్‌తో పోల్చితే ఓమిక్రాన్ విషయంలో మరింత సిద్ధంగా ఉన్నామని డెల్టా లహరియా చెప్పారు. గతంతో పోలిస్తే ఇప్పుడు మరింత సిద్ధమయ్యాం. ఈ వేరియంట్ కూడా త్వరగా కనుగొన్నారు. ఇప్పుడు లాక్ డౌన్ అవసరం లేదు. అవసరమైన పరిమితులను వర్తింపజేయడం ద్వారా మాత్రమే దీనిని నియంత్రించవచ్చు, అయితే ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలలో సిబ్బంది, మందులు .. అవసరమైన పరికరాలు ఉండాలి, తద్వారా కేసులు పెరిగినప్పుడు రోగులను ప్రారంభంలో నియంత్రించవచ్చు.వైరస్ ఇప్పుడు ప్రతిచోటా ఉందని, కాబట్టి లాక్‌డౌన్ విధించడం వల్ల ఉపయోగం లేదని లహరియా చెప్పారు. లాక్‌డౌన్ విధించడం ద్వారా, మనం వైరస్ వేగాన్ని మాత్రమే తగ్గించగలము, దానిని తొలగించలేము. దీనికి బదులు, కేసులు పెరుగుతున్న ప్రాంతాల ప్రజలు మాస్కులు ధరించాలి. అత్యవసరమైనప్పుడు మాత్రమే ప్రయాణం చేయాలి. రద్దీగా ఉండే ప్రాంతాలకు వెళ్లవద్దని, ఇంకా టీకాలు వేయని వారు వెంటనే వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

# సంతనూతల పాడు వైసీపీలో లొల్లి



ఒంగోలు, జనవరి 7, (న్యూస్ పల్స్)టీజేఆర్ సుధాకర్‌బాబు. ప్రకాశంజిల్లా సంతనూతలపాడు ఎమ్మెల్యే. గుంటూరు జిల్లాకు చెందిన సుధాకర్‌బాబు గత ఎన్నికల సమయంలో ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు అభ్యర్థిగా వైసీపీ నిర్ణయించటంతో ఇక్కడకు వచ్చి.. పోటీ చేసి వైసీపీ గాలిలో సునాయసంగా గెలిచారు. నియోజకవర్గ వైసీపీ కార్యకర్తలు ఆయన్ని పొరుగు వ్యక్తిగా చూడకుండా అక్కున చేర్చుకున్నారు కూడా. కొత్తలో ఎమ్మెల్యేకు.. కేడర్‌కు మధ్య కెమిస్ట్రీ బాగానే ఉన్నా.. రెండున్నరేళ్ల తర్వాత లుకలుకలు బయటకు వస్తున్నాయి. అవి కొత్త రగడకు.. చర్చకు దారితీస్తున్నాయట.ఆ మధ్య సొంత పనులపై హైదరాబాద్ వెళ్లిన ఎమ్మెల్యే సుధాకర్‌బాబు అవసరం లేదంటూ వ్యక్తిగత భద్రతా సిబ్బందిని వెనక్కి పంపారట. ఈ అంశం అధికారపార్టీతోపాటు పోలీసు వర్గాల్లో చర్చగా మారింది. నాగులుప్పలపాడు మండలంలో ఆ మధ్య జరిగిన కొన్ని సంఘటనల వల్ల మనస్తాపం చెంది ఎమ్మెల్యే ఆ నిర్ణయం తీసుకున్నారని లోకల్‌గా వినిపిస్తున్న టాక్. ఆ మండలంలోని ఒక కీలక నేతకు.. ఎమ్మెల్యే సుధాకర్‌బాబుకు మధ్య సమన్వయం కొరవడిందట. ఎంపీడీవో నియామకంపై బేధాభిప్రాయాలు వచ్చినట్టు తెలుస్తోంది.నాగులుప్పలపాడు మండలానికి చెందిన ఆ నాయకుడు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై ఫిర్యాదు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. చీమకుర్తి నుంచి మరో కీలకవర్గం కూడా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా అధిష్ఠానాన్ని కలిసి ఫిర్యాదు చేసిందట. ఈ పరిణామాలపై అసంతృప్తి చెందిన సుధాకర్‌బాబు తన వ్యక్తిగత భద్రతా సిబ్బందిని వెనక్కి పంపారని చెబుతున్నారు.నియోజకవర్గంలోని గ్రామ, మండలస్థాయి అధికారుల బదిలీలు, నియామకాల్లోనూ వైసీపీ ద్వితీయ శ్రేణి నేతలతో సంబంధం లేకుండా తనకు ఇష్టం వచ్చిన వారికే ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే దగ్గర పనిచేస్తున్న వ్యక్తిగత సహాయ సిబ్బందిలో ఐదుగురిని చీమకుర్తి నగర పంచాయతీ ఉద్యోగులుగా చూపించి జీతాలు తీసుకోవటం కూడా విమర్శలకు దారి తీస్తోందట. పంచాయతీ విధులకు హాజరుకాకుండా వారెలా జీతాలు తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారట. వారికి జీతాల కోసమే ఏటా ఏడు లక్షలు ఖర్చవుతున్నట్టు సమాచారం.గతంలో కూడా అధికారుల బదిలీలకు సంబంధించి ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై ఆరోపణలు వచ్చాయని గుర్తు చేస్తుంటారు ఆయన ప్రత్యర్థులు. పనిలోపనిగా ఎమ్మెల్యే కూడా సొంత వర్గాన్ని సిద్ధం చేసుకుంటున్నారట. తనకు అనుకూలంగా ఉన్న నేతలకు పనులు చేసుకునేందుకు అవకాశాలు ఇస్తున్నట్టు వైరివర్గం మండిపడుతోంది. అలాగే వైసీపీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తున్న ద్వితీయ శ్రేణి నేతల కార్యకలాపాలపై సేకరించిన సమాచారాన్ని వైసీపీ కేంద్ర కార్యాలయానికి ఎమ్మెల్యే పంపారట. దీంతో సంతనూతలపాడు వైసీపీలో ఎమ్మెల్యే వర్సెస్ వైసీపీలోని ఆయన ప్రత్యర్థివర్గంగా పరిస్థితి మారిందట.పరిస్థితి చేజారిపోకుండా సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి వైసీపీ అధిష్ఠానం అప్పగించినట్టు ప్రచారం జరుగుతోంది. మరి.. సంతనూతలపాడు వైసీపీలో అసమ్మతిని చల్లార్చేందుకు మంత్రి బాలినేని ఏ అస్త్రాన్ని ప్రయోగిస్తారు? పార్టీ కేడర్ ఎమ్మెల్యే వెంట నడుస్తుందా.. ఢీ అంటే ఢీ అని ఘర్షణ పడుతుందో చూడాలి.

# అమాత్య పదవి కోసం ఎదురుచూపులు

శ్రీకాకుళం, జనవరి 7, (న్యూస్ పల్స్)మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. త్వరలో జరగనున్న విస్తరణలో తనకు చోటు దక్కుతుందని భావించారు. కానీ ఇప్పుడు చూస్తే అసలుకే ఎసరు వచ్చింది. ఆయనే పాయకరావుపేట ఎమ్మెల్యే గొర్ల బాబూరావు. మూడు సార్లు గొర్ల బాబూరావు ఎమ్మెల్యేగా గెలిచారు. దళిత కోటా కింద ఆయనకు మంత్రి పదవి తొలివిడతలోనే రావాల్సి ఉంది. అయితే అదే జిల్లాలో అవంతి శ్రీనివాసరావుకు మంత్రి పదవి ఇవ్వడంతో ఆయనకు దక్కలేదు. ఇక రెండోవిడత విస్తరణలో తనకు ఖచ్చితంగా జగన్ కేబినెట్ లో స్థానం దక్కుతుందని ఆశించారు. కానీ ఆయన ఆశలు నెరవేరేటట్లు లేవు. దానికి కారణం ఆయన చేతులారా చేసుకున్నదే. క్షేత్రస్థాయిలో గొర్ల బాబూరావు కు పార్టీ నుంచే వ్యతిరేకత ఎదురవుతుంది. పాయకరావు పేట నియోజవర్గంలో అన్ని మండలాల్లో సొంత పార్టీ నేతలే ఎదురుతిరుగుతున్నారు. తాము వైసీపీలోనే ఉంటామని, కానీ బాబూరావుకు వ్యతిరేకమని బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నారు. పాయకరావుపేట నియోజకవర్గం తొలి నుంచి కాపులకు సానుకూలంగా ఉండే నియోజకవర్గం. ఇక్కడ కాపు సామాజికవర్గం ఓటర్లు ఎక్కువ. కానీ ఇది రిజర్వుడ్ నియోజకవర్గం అయింది. దీంతో ఇక్కడ ఎస్సీ నేతలు ఎమ్మెల్యేలుగా గెలిచినా కాపు నేతలు చెప్పినట్లు వినాల్సి వస్తుంది. గొర్ల బాబూరావుకు వ్యతిరేకంగా వైసీపీలో గ్రూపులు ఆయనకు చికాకు పెట్టే విధంగా ఉన్నాయి. ఆయన నియోజకవర్గంలో తిరగాలన్నా ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. పాయకరావుపేటలో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా అధిష్టానం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంది. అంటే గొర్ల బాబూరావుపై హైకమాండ్ పాజిటివ్ థింకింగ్ లేనట్లే ఉంది. ఆయన కొన్నాళ్లు అధిష్టానం పై అలిగి నియోజకవర్గానికి దూరంగా కూడా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో టీటీడీ సభ్యుడిగా నియమించారు. అదీ ఆయనకు ఇష్టంలేదు. మొత్తం మీద పాయకరావుపేటలో నెలకొన్న పరిస్థితుల్లో ఆయనకు వచ్చే మంత్రివర్గంలో కూడా చోటు దక్కే అవకాశాలు లేవన్నది పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం

# క్యాంపు కార్యాలయం నుంచే అంతా

విజయవాడ, జనవరి 7, (న్యూస్ పల్స్)గన్ కు బయట జరిగేదీమీ అర్థం కావడం లేనట్లుంది. తాడేపల్లి కార్యాలయంలో కూర్చుని అంతా పచ్చగా ఉందని అనుకుంటే పొరపాటే. బటన్ నొక్కుతూ డబ్బులు పంపుతుంటే ఓట్లు పడతాయని భావిస్తున్నారేమో. అప్పుడప్పుడు బయటకు వచ్చి ఇలా చేతులూపి పోతుంటే మళ్లా 151 స్థానాలు వస్తాయిని ఆశిస్తున్నారేమో. కానీ జగన్ మీరు అనుకున్నట్లు బయట పరిస్థితి లేదు. క్షేత్రస్థాయిలో ప్రజలు కాదు మీ పార్టీ కార్యకర్తలో ఎందుకు పార్టీ కోసం పనిచేయాలిరా బాబూ అంటూ తలలు పట్టుకుంటున్నారు. క్యాడర్ అసహనం, అసంతృప్తి మీ చెవికి ఎక్కే అవకాశాలు ఎంత మాత్రం లేవు. ఎందుకంటే మీరు కలిసే నేతలే తక్కువ. వారు నిజాలను నిర్భయంగా మీకు చెప్పే సాహసం చేయరు. చంద్రబాబు మాదిరిగానే మీరు కూడా అధికారులపై ఆధారపడి సంతృప్తి స్థాయి లెక్కలు వేసుకుంటూ నవ్వుకుంటూ కార్యాలయంలోనే సమీక్షలతో కాలక్షేపం చేస్తున్నారు. అనకూడదు కాని ఎప్పుడు రచ్చబండకు వస్తామన్నారు? ఎన్ని రోజులయింది?ఇక ఎన్నికలకు రెండేళ్లు మాత్రమే సమయం ఉంది. చివరి ఏడాది మీరు ఏం చెప్పినా జనం నమ్మే పరిస్థితి ఉండదు. ఏం చేసినా ఈ ఏడాదికాలంలోనే చేయాలి. మీ చేతిలో ఏమో చిల్లిగవ్వ లేకపోయే. అందుకే మీరు బయటకు రానట్లుంది. ఒకవేళ బయటకు వస్తే ఆ నియోజకవర్గాలకు వరాలు ప్రకటించాల్సి ఉంటుంది. అలా ఉత్తుత్తి ప్రకటనలు చేయడం మీకు ఇష్టం లేనట్లుంది. నిధులు లేకుండా, ఫండ్స్ విదల చేయకుండా రచ్చబండ ఎందుకని అనుకున్నారా ఏందీ?

మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్నాయి. థర్డ్ వేవ్ వస్తే మరో మూడు నెలలు బయటకు రాలేరు. ప్రజల్లోకి వచ్చి పార్టీలో జోష్ నింపితేనే వచ్చే ఎన్నికల ఫలితాలపై కొంత హోప్ పెరుగుతుంది. ఎన్నికల సమయంలో వచ్చి సినిమా చూపిస్తానంటే అది ఫ్లాప్ అయినా అవ్వొచ్చు. చివరకు క్యాంప్ కార్యాలయం ఇల్లుగా మారే అవకాశం లేకపోలేదు. అతి విశ్వాసాన్ని వదిలి జనంలోకి జగన్ రావాలని పార్టీ క్యాడర్ కోరుకుంటుంది. ఇకనైనా జగన్ బాబూ బయటకు రా అని కోరుతుంది. మరి జగన్ ఎప్పుడు వస్తారు? జగన్ అనుకున్న ఎల్లోమీడియా చూపిస్తున్నవి అసత్యాలని జగన్ భావించవచ్చు. కానీ అవి అర్ధ సత్యాలు అని ఆలోచించుకుంటే బయటకు వస్తారు.

# సంక్రాంతికైనా సినిమాలకు సొల్యూషన్ దొరుకుతుందా

విజయవాడ, జనవరి 7, (న్యూస్ పల్స్) ఒకవైపు టికెట్ల వివాదం, మరో వైపు థియేటర్లలో తనిఖీలు, యజమానుల మూసివేతలు ఏపీలో వినోదరంగాన్ని కుదిపేస్తున్నాయి. సాధారణంగా సినిమా పరిశ్రమకు సంక్రాంతి ప్రధానమయింది. ప్రజలకు వినోదాన్ని అందించే సినిమాపై వివాదాలు నెలకొనడం.. క్రమంగా రాజకీయ రంగు పులుముకోవడం కలవరం కలిగిస్తోంది. ప్రభుత్వం తెచ్చిన నిబంధనలతో నష్టపోయేది ఎవరు? అనేది చర్చనీయాంశంగా మారింది. గతంలో సినిమాలంటే 50 రోజులు, 100 రోజులు, 200 రోజులు ఆడాలని భావించేవారు. కానీ ఇప్పుడు సినిమాలంటే మొదటి వారం రోజుల్లోనే పెట్టిన పెట్టుబడంతా వెనక్కి వచ్చేయాలన్న ఫార్ములా అమలుచేస్తున్నారు.సినిమా హిట్ అయిందా ఫట్ అయిందా అని తెలిసేలోగానే పెట్టిన పెట్టుబడి రాబడుతున్నారు. అందులో భాగంగానే బెనిఫిట్ షోలు, అదనపు షోలు వేయడమే కాకుండా.. వీలైనన్ని ఎక్కువ థియేటర్లలో రిలీజ్ చేస్తున్నారు. కానీ ఏపీలో టికెట్ ధరలు తగ్గించడం, బెనిఫిట్ షోలపై ఆంక్షలు సినిమా రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం నిబంధనలపేరుతో తనిఖీలు చేయిస్తోంది. లైసెన్స్ రెన్యువల్, ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, ఫారమ్-బి వంటి పత్రాల పేరుతో కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ప్రభుత్వం కొన్ని థియేటర్లను సీజ్ చేయగా.. మరికొందరు యజమానులు తమ వల్ల కాదంటూ స్వచ్ఛందంగా సినిమా హాళ్లను మూసివేశారు.దీంతో ఏపీలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. ఇంత జరుగుతున్నా.. ప్రభుత్వం మాత్రం తన చర్యలను సమర్థించుకుంటోంది. ప్రజలకు తక్కువ ధరకు వినోదాన్ని అందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని.. హీరోలు రెమ్యునరేషన్లు తగ్గించుకుంటే ఈ గోల ఉండదని పలువురు మంత్రులు చెబుతున్నారు. రూల్స్ అంటే అందరికీ ఒకటేనని అంటున్నారు. తాజా సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం కమిటీ నియమించింది.కమిటీ సిఫార్సుల ఆధారంగానే ప్రభుత్వం ముందుకు వెళ్తుందని మంత్రి పేర్ని నాని చెబుతున్నారు. కమిటీ పేరుతో కాలయాపన జరిగితే పెద్ద సినిమాల విడుదలపై సందిగ్ధత ఏర్పడక మానదు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై సంక్రాంతి సీజన్ లో సినిమాలకు బ్రేక్ పడనుంది. ఫిబ్రవరిలో విడుదల కానున్న ఆచార్య, భీమ్లా నాయక్ వంటి సినిమాల భవిష్యత్తు ఆధారపడి వుంది.

# రఘురామ రాజీనామా... రాజీనామా కు రెడీ

హైదరాబాద్, జనవరి 7, (న్యూస్ పల్స్)వైసీపీకి దూరంగా ఉంటున్న నరసాపురం ఎంపీ రఘురామకృష్ణమ రాజురాజీనామాకు రెడీ అవుతున్నారు. ఎంపీ పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలుస్తానని ఆయన సవాల్ విసిరారు. కొంత కాలంగా వైసీపీకి ఆయన దూరంగా ఉంటున్నారు. తరచూ వైసీపీ అధిష్టానం తీరుపై విరుచుకపడుతున్నారు. దీంతో పార్టీ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడుతున్న ఆయనపై అనర్హత వేటు వేయాలని వైసీపీ ఇప్పటికే స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో తనపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద రఘురామపై స్పీకర్ అనర్హత వేటు వేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. స్పీకర్ యాక్షన్ తీసుకుంటారని తెలిసి? రఘురామకృష్ణమరాజు తన లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. తన ఎంపీ పదవికి రాజీనామా చేయనున్నట్లు స్వయంగా ఆయన మీడియాకు వెల్లడించారు.తనపై అనర్హత వేటు వేయించాలని కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. అనర్హత వేటు వేయించేందుకు సమయం ఇస్తున్నట్లు తెలిపిన రఘురామ.. వేటు వేయకపోతే తానే రాజీనామా చేస్తానని చెప్పారు. రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్తానని చెప్పారు. ఏపీలో అధికార వైసీపీపై ప్రజా వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో ఎన్నికల ద్వారా తెలియజేస్తానని చెప్పారు. ఏపీ రాజధానిగా అమరావతిని కొనసాగించాలని డిమాండ్ చేశారు.రఘురామ తన ఎంపీ పదవికి రాజీనామా చేస్తే.. నరసాపురం లోక్‌సభ నియోజకవర్గవర్గానికి ఉప ఎన్నిక అనివార్యం అవుతుంది. రెండ్రోజుల క్రితం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో రఘురామ భేటీ అయ్యారు.

# కాకినాడ గొట్టం కాజాతో ప్రత్యేక స్టాంపు

కాకినాడ, జనవరి 7, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ లో అత్యంత ఆదరణ కలిగిన స్వీట్స్ కు అరుదైన గౌరవం దక్కింది. వందేళ్లకు పైగా ఘనమైన చరిత్ర కలిగిన కాకినాడ గొట్టం కాజాతో ఉన్న ప్రత్యేక స్టాంపుని భారతీయ తపాలా శాఖా విడుదల చేసింది. ఒక్కసారి తింటే మరల మరల తినాలనిపించే కాకినాడ గొట్టం కాజాకు అరుదైన గుర్తింపు లభించినట్లు అయింది. దీంతో గోదావరి జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కాకినాడ కాజాగా ఖ్యాతిగాంచిన ఈ కాజాను కోటయ్య అనే వ్యక్తి మొట్టమొదటి సారిగా 1891 సంవత్సరంలో తయారు చేశారు. ఈ కాజాకు ఉండే ప్రత్యేకమైన రుచి వలన కాకినాడ కోటయ్య కాజాగా కీర్తి పొందారు. కాకినాడకు లేదా చుట్టపక్కల ప్రాంతాలకు వెళ్ళిన విదేశాలలో, ఇతర రాష్ట్రాలలో ఉన్న తెలుగువాళ్లు కాకినాడకు వస్తే తప్పకుండా కాజాను కొనుగోలు చేస్తారు.2018లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కాజాకు జియోగ్రాఫిక్ ఇండికేషన్ సౌకర్యం కల్పించి అంతర్జాయంగా మరింత ప్రచారం కల్పించింది. ఇపుడు భారత తపాలా శాఖ వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న కాకినాడ గొట్టం కాజాను నేటి తరం గుర్తించేందుకు ఈ కాజాతో పోస్టల్ కవర్ ద్వారా మరింత వెలుగులోకి తెచ్చింది. ఆంధ్రుల గౌరవం మునుపటితో పోలిస్తే మరింతగా పెరిగిందంటున్నారు ఉభయగోదావరి జిల్లా ప్రజలు.కాకినాడ గొట్టం కాజాతో పాటు విశాఖ జిల్లాకు చెందిన మాడుగుల హల్వా కు విశిష్ట స్థానం కల్పించింది భారతీయ పోస్టల్ శాఖ. మాడుగుల వేదికగా 1890లో తొలిసారి ఈ హల్వాను తయారు చేశారు. ఈ హల్వాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. గోధుమపాలు, నెయ్యి, బాదం పప్పు, జీడిపప్పు వంటి పదార్థాలతో రుచికరమైన హల్వాను తయారు చేస్తారు. ఈ హల్వాకు లైంగిక సామర్థ్యం పెంచే గుణం కూడా ఉన్నట్టు అంతర్జాతీయంగా ప్రచారంలో ఉంది. ఇప్పుడు పోస్టల్ శాఖ మాడుగుల హల్వాతో ఉన్న ఓ పోస్టల్ స్టాంప్ ను రిలీజ్ చేసింది. దీంతో మాడుగుల హల్వా తయారీదారులతో పాటు ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కారుమూరికి ఇంటి పోరు

ఏలూరు, జనవరి 7, (న్యూస్ పల్స్) తనకోపమే తన శత్రువు అన్నది వేమన చెప్పిన మాట. రాజకీయాల్లో ఈ కోపం అస్సలు పనికిరాదు. కొన్ని సార్లు ఆ కోపమే.. నాయకుల కొంప ముంచుతుంది. లేని శత్రువులను తయారు చేస్తుంది. పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు ఎమ్మెల్యే విషయంలోనూ అదే జరుగుతోంది. సొంత పార్టీ నేతల నుంచే వైసీపీ ఎమ్మెల్యేకి అసమ్మతి సెగ మొదలైంది. తణుకులో మాస్ లీడర్‌గా పేరుతెచ్చుకున్నారు ఎమ్మెల్యే కారుమూరి నాగేశ్వర్రావు. ఇప్పుడు లోకల్‌గా సొంత పార్టీ నుంచే ఆయనకు అసమ్మతి ఎదురవుతోంది. జెడ్పీటీసీ గా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి.. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు.. కోపమే మైనస్ పాయింట్‌గా మారిందంటున్నారు స్థానిక పార్టీ లీడర్స్.ఇటీవల జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో.. వైసీపీ నియోజకవర్గ ప్రచారకమిటీ ఛైర్మన్ సాయిరాంరెడ్డిపై ఎమ్మెల్యే కారుమూరి కాస్త నోరుజారారు. ప్రజలకు మేలు చేయాలని చూస్తుంటే.. పార్టీలోని కొన్ని దుష్టశక్తులు అడ్డుకుంటున్నాయంటూ.. పరోక్షంగా సాయిరాం రెడ్డిపై విమర్శలు గుప్పించారు. జగన్ చేసే మంచి పనులను విపక్షాలను అడ్డుకుంటున్నట్లే.. నియోజకవర్గంలో మంచి పనులను కొందరు అడ్డుకుంటున్నారని ఆరోపించారు.ఎమ్మెల్యే కారుమూరి వ్యాఖ్యలతో మనస్తాపం చెందిన సాయిరాంరెడ్డి? తన పదవికి రాజీనామా చేశారు. తణుకు టౌన్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న ఆయన సోదరుడు సత్తి సత్యనారాయణ రెడ్డి కూడా రిజైన్ చేశారు. వీరిద్దరూ రాజీనామా చేయడం.. స్థానికంగా చర్చనీయాంశమైంది. అయితే, ఈ వ్యవహారంపై వైసీపీ అధిష్టానం దృష్టిసారించినట్టు తెలుస్తోంది. ఇంచార్జ్ వైవీ సుబ్బారెడ్డి.. ఇప్పటికే రిపోర్ట్ తెప్పించుకున్నట్టు తెలిసింది. ఇద్దరు నేతలతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు.ఎమ్మెల్యే కారుమూరుకు వ్యతిరేకంగా సాయిరాంరెడ్డి వర్గం పోస్టులు పెట్టడంపైనా అధిష్టానం సీరియస్ అయినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే కారుమూరి కూడా ఆ స్థాయిలో రియాక్టవడం కరెక్టు కాదని నచ్చజెప్పినట్టు తెలుస్తోంది. మొత్తానికి ఈ వ్యవహారం పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.మొన్నటికి మొన్న పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుపై సొంత పార్టీ నేతలు తిరుగుబావుటా చేయడం తెలిసిందే. ఇప్పుడు తణుకు ఎమ్మెల్యేపై పార్టీ నేతలు తిరుగుబాటు చేయడం వైసీపీ పెద్దలకు తలనొప్పిగా మారింది.

# పోలవరం ఖర్చు... మళ్లీ విడుదల

ఏలూరు, జనవరి 7, (న్యూస్ పల్స్)పోలవరం ప్రాజెక్టుకు రూ.320 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులను 2021?22 బడ్జెట్‌లో కేంద్ర జల్ శక్తి శాఖకు కేటాయించిన నిధుల నుంచి పోలవరం ప్రాజెక్టు అథారిటీ కి విడుదల చేయాలని ఆదేశించారు. ఇవి గురువారం పీపీఏ ఖాతాలో చేరతాయి. శుక్రవారం రాష్ట్ర ఖజానాకు చేరతాయని అధికారవర్గాలు వెల్లడించాయి.విభజన చట్టంలో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్రం.. 2014 ఏప్రిల్ 1న నీటి పారుదల విభాగం వ్యయం వంద శాతం తిరిగిస్తామని (రీయింబర్స్ చేస్తామని) హామీ ఇచ్చింది. ప్రాజెక్టు పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా రూ.18,372.14 కోట్లు ఖర్చు చేసింది. అందులో 2014 ఏప్రిల్ 1 తర్వాత చేసిన వ్యయం రూ.13,641.43 కోట్లు. ఇందులో కేంద్రం ఇప్పటిదాకా రూ.11,492.16 కోట్లు తిరిగిచ్చింది. ఇంకా రూ.2,149.27 కోట్లను కేంద్రం బకాయిపడింది. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.2,149.27 కోట్ల బిల్లులను ప్రాజెక్టు అధికారులు పీపీఏకు సమర్పించారు. ఈ బిల్లులను పరిశీలిస్తున్న పీపీఏ.. ప్రస్తుతానికి రూ.711.60 కోట్లు రీయింబర్స్ చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖకు పంపింది. దీనికి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) కూడా ఆమోదం తెలపడంతో, ఈ మొత్తాన్ని మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర జల్ శక్తి శాఖ కేంద్ర ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపింది. ఇందులో తొలి దశలో రూ.320 కోట్లను ఆర్థిక శాఖ మంజూరు చేసింది. మిగతా మొత్తాన్ని మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. తాజాగా మంజూరు చేసిన రూ.320 కోట్లు పోను, కేంద్రం ఇప్పటికీ రాష్ట్రం చేసిన ఖర్చులో రూ.1829.27 కోట్లను తిరిగి చెల్లించాల్సి ఉంది.



# మహిళపై యాసిడ్ దాడి



గుంటూరు జనవరి 7, (న్యూస్ పల్స్) గుంటూరు జిల్లా గురజాల మండలం మాడుగులలో మహిళపై గుర్తు తెలియని వ్యక్తి యాసిడ్ తో దాడి చేసాడు. గురువారం రాత్రి ఇంటి వరండాలో బాధితురాలు పిల్లతో నిద్రిస్తుంది. ఒక గుర్తు తెలియను వ్యక్తి మహిళ ఇంటి వద్దకు మంచి నీళ్ల కావాలని అడిగాడు. మంచినీళ్లు ఇచ్చేందుకు వచ్చిన మహిళపై గుర్తు తెలియని యాసిడ్ తో దాడి చేసాడు. ఘటనలో మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే బాధితురాలిని కుటుంబసభ్యులు గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత మహిళ భర్త మూడేళ్ల కిందట చనిపోయాడు. యాసిడ్ దాడి ఘటనపై గురజాల పోలీసులు కేసు నమోదు చేసారు. అనుమానితుడు మంచికల్లు గ్రామ వ్యక్తిగా కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### మంగళగిరి లో అగ్ని ప్రమాదం.. వ్యక్తి మృతి

గుంటూరు జనవరి 7, (న్యూస్ పల్స్) మంగళగిరి పట్టణం కుప్పురావుకాలనీ 9వ లైన్ లోని ఓ బిల్డింగ్ లో శుక్రవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న మంగళగిరి అగ్నిమాపక శాఖ సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలని అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదం లో శరీరం కాలి వ్యక్తికి తీవ్ర గాయాలవగా ఆసుపత్రికి తరలించి సమయంలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

## అనుమానాస్పద స్థితిలో హోం గార్డు మృతి

నెల్లూరు నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న మురికి కాలువ లో హోం గార్డు మృతదేహం లభ్యమైంది. నెల్లూరు 2వ టౌన్ లో పని చేసే వెంకటయ్య అనే హోం గార్డు గా గుర్తించారు. మురికి కాలువ లో మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన హోం గార్డు వెంకటయ్య మృతదేహం పై తల శరిరం పై గాయాలు ఉన్నట్లు గుర్తించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా లేదా ఎవరైనా హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నదిలోపడిన కారు..

నెల్లూరు జనవరి 7, (న్యూస్ పల్స్)సూళ్లూరుపేట సమీపంలోని చెన్నై–కలకత్తా జాతీయ రహదారిపై ఉన్న కాళంగి నది వంతెన వద్ద కారు ప్రమాదం చోటు చేసుకుంది. వంతెన పై నుంచి కారు నదిలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జయింది. కారులో ప్రయాణికులు ఎవ్వరూ లేకపోవడంతో కారు ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వంతెన మీద నుంచి ఎవరైనా కారును నెట్టేశారా లేక ప్రమాదవశాత్తు జరిగిందా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

## దౌర్జన్యం పనికిరాదు

విజయనగరం జనవరి 7, (న్యూస్ పల్స్) మాన్సాస్ ఆస్తులపై దౌర్జన్యం చేయటం మంచి పద్ధతికాదని టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతి రాజు అన్నారు. మాన్సాస్‌లో ఆర్థిక అక్రమాలు జరిగాయని ఎక్కడెక్కడ నుండో ఆడిటర్లను తెప్పించి హంగామా సృష్టించారని, చివరకు కోర్టుతో చీవాట్లుతిన్నారని తెలిపారు. ఎంత మంచి రాజ్యాంగం ఉన్నా చెడ్డవారి చేతిలో పడితే చెడే జరుగుతుందన్నారు. ఎంత చెడ్డ రాజ్యాంగమైనా మంచి వారి చేతిలో పడితే మంచే జరుగుతుంది అన్న అంబేద్కర్ వ్యాఖ్యలు నేడు నిజమవుతున్నాయని తెలిపారు. దేవుడు ఆస్తులు, ధర్మాదాయ ఆస్తులపై పడటం గమ్మత్తుగా మారిందన్నారు. ఏ మత విషయాలతో ప్రభుత్వాలకు సంబంధం లేదని... కానీ ఇక్కడ మాత్రం అందుకు భిన్నమని అశోక్ గజపతి రాజు వ్యాఖ్యలు చేశారు.

### భర్త ఇంటిముందు భార్య బైఠాయింపు

విశాటపట్నంజనవరి 7, (న్యూస్ పల్స్) ప్రేమించి వివాహం చేసుకు న్న భర్త నుంచి వేదింపులు అదికమవ్వ డంతో ఓ వివాహిత మహిళా సంఘా లను ఆశ్రయించింది.అగ్నిసాక్షిగా తాళి కట్టిన ఆ యువకుడు నిత్యం హింసల కు గురి చెయ్యడంతో దిక్కుతోచని స్థితి లో ఆ వివాహిత న్యాయం కోసం మహి ళా సంఘాలతో కలసి మీడియా ముం దుకు వచ్చి తన ఆవేదన వ్యక్తం చేసిం ది.విశాఖనగరంలో రెల్లివీది ప్రాంతానికి చెందిన ఉమా మహేశ్వరి అనే యువ తి 2005లో పోలరాజు అలియాస్ భీమా అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది.అయితే ఆ వ్యక్తిపై రౌడీషీ ట్ తోపాటుగా వివాహేతర సంబం దాన్ని కూడా కొనసాగిస్తున్నాడు.భర్తపై దిశాపోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా తిరుమార్చుకొకపోవడంతో మహిళా సంఘాలను ఆశ్రయించిన ఆ వివాహి త తనకు న్యాయం చెయ్యాలని వేడుకుంటోంది.

## యాధేచ్ఛాగా అక్రమ మైనింగ్

### దేవినేని ఉమామహేశ్వరరావ్వు

నందిగామ జనవరి 7, (న్యూస్ పల్స్) అక్రమంగా మైనింగ్ జరుగుతుంటే స్థానిక శాసనసభ్యులు, మైనింగ్ అధికారులు రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. గతంలో మైలవరం లో అక్రమ మైనింగ్ పరిశీలించడానికి వెళ్తే కేసులు పెట్టారు, ఇప్పుడు ఆంక్షలు విధిస్తున్నారు. 2024 ఎన్నికల కోసం అపార్ట్ మెంట్ లో డబ్బులను పార్కింగ్ ప్లేస్ లో పెడుతున్నారు. ఇటీవల ఒక అపార్ట్ మెంట్ లో కట్టల కట్టల డబ్బు లు దొరికాయి. రాష్ట్రంలో అవినీతి డబ్బు మొత్తం పార్టీ నాయకుల ద్వారా తాడేపల్లి రాజ ప్రసాదానికి చేరుతుంది. అవినీతిపై ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెడుతున్నారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలను సాక్షి గుమస్తా, బూతులు మంత్రులు, బూతులు మాట్లాడుతున్నారు. పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. బూతులు మంత్రులు బూతులు మాట్లాడుతున్నారు టీవీ5, ఏబీఎన్ ,ఆంధ్రజ్యోతిని, ఈనాడు ను చూడ వద్దంటున్నారు. అసలు మీ మొహాలు చూడడానికి ప్రజలు ఇష్టపడడం లేదు. చానల్స్ రద్దు చేయడం కాదు ముందు మీ పార్టీని రద్దు చేసుకోండి. రాష్ట్రంలో జగన్ ఆర్థిక విధ్వంసం సృష్టిస్తున్నారని అన్నారు.

# కోడిపందాలు నిర్వహణ జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

**జనవరి 15 నాటికి రబీ నాట్లు పూర్తి అవ్వాలి**

**రైతుల్లో అవగాహన కల్పించాలి**

**ఓటీఎస్ లబ్దిదారులతో జనవరి 11, 12 తేదీల్లో మెగా మేళా ఏర్పాటు చేయాలి**

**మండల స్థాయి అధికారులు జాయింట్ యాక్షన్ టీం గా సమన్వయం చేసుకోవాలి**

**ఆర్డీవో ఎస్. మల్లిబాబు**

కొవ్వూరు కొవ్వూరు డివిజన్ పరిధిలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందెలు , ఇతర నిషేధిత క్రీడలు నిర్వహించుట చట్టవ్యతిరేకమైనవిగా పరిగణించటం జరుగుతోందని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్. మల్లిబాబు స్పష్టం చేశారు.శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డిఎస్పీ శ్రీనాథ్ తో కలిసి తహసీల్దార్ లు, ఎంపీడీఓ లు, సంబంధిత శాఖల అధికారులతో దృశ్య శ్రవణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సందర్భంగా చట్టవ్యతిరేక చర్యలలో భాగంగా కోడి పందాలు , ఇతర ఆటలను నిర్వహించేందుకు కొందరు ఔత్సాహికులు ఏర్పాట్లు చేసుకునేందుకు ప్రణాళికలు తయారు చేయడం జరుగుతోందని, అటువంటివి నిరోధించడానికి మండల స్థాయిలో అధికారులు బృందాలు గా ఏర్పడి పోలీసు అధికారులు రూపొందించిన మార్గదర్శకాలు కఠినంగా అమలు చెయ్యాల్సి ఉందన్నారు. మండల స్థాయిలో అధికారులు టీమ్స్ గా ఏర్పడి ప్రజల్లో, నిర్వాహకుల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. గౌరవ న్యాయ స్థానం, జిల్లా కలెక్టర్ వారిచే కోడి పందెలు నిర్వహించకుండా చూడాలని ఆదేశాలు ఉన్న నేపథ్యంలో ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండి, ప్రతి చర్యను రికార్డ్ చెయ్యాల్సి ఉందని మల్లిబాబు ఆదేశించారు. రబీ సీజన్ కి సంబంధించిన నాట్లు జనవరి 15 నాటికి పూర్తి చెయ్యాల్సి ఉందని, ఎంపీడీఓ, వ్యవసాయ అధికారి కలిసి రైతులకు పత్రికలు, సమావేశాలు ద్వారా అవగాహన కల్పించాలని ఆర్డీవో మల్లిబాబు తెలిపారు. రబీ లో సాగుచేసే లక్ష్యాలపై నివేదిక ఆధారంగా క్షేత్రస్థాయిలో ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ఓటీఎస్ కి సంబంధించి జనవరి 11, 12 తేదీల్లో మండల పరిధిలో మెగా మేళా చెప్పట్టాల్సి ఉందని ఆర్డీవో ఎస్. మల్లిబాబు పేర్కొన్నారు. లబ్దిదారులకి అవగాహన కల్పించి, చెల్లింపు లు జరిపేలా అడుగులు వెయ్యాల్సి ఉందన్నారు. ఓటిఎస్ కి సంబంధించిన వారి డేటా నమోదు, లబ్దిదారుల గుర్తింపు, ఓటీఎస్ చెల్లింపు చేసిన వారి వివరాలు నమోదు సమర్ధవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హత ఉన్న వారి సమగ్ర సమాచారం గ్రామ, వార్డు కార్యదర్సులు గుర్తించాలన్నారు. అసంబద్ధ కారణాలు చూపుతూ నివేదికలు ఇవ్వడం సరికాదన్నారు.డిఎస్పీ బి. శ్రీనాథ్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో ఎక్కడా కోడి పందెలు, ఇతర నిషేధ ఆటలు నిర్వహణ కోసం బరులు ఏర్పాటు కై కొందరు ప్రయత్నాలు చేసుకుంటారని, అటువంటి వాటిని నిరోధించడానికి అధికారులు సమన్వయంతో కలసి పనిచేయాల్సి ఉందన్నారు. బరులు, షేడ్స్ ఏర్పాటు కి యంత్రాలు, భూములు చదును చేసుకుంటున్నారని, మండలంలోని, గ్రామంలోని అధికారులు, సిబ్బంది అటువంటి వాటి ఫోటోలు తియ్యడం, వీడియోలు చిత్రీకరణ చెయ్యాల్సి ఉందన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా భూముల చదును తదితర పనులు చేసే వారిపై బైండోవర్ కేసులు నమోదు చెయ్యాలని శ్రీనాథ్ స్పష్టం చేశారు.

కొవ్వూరు మండలం కి సంబంధించిన వారం క్రితం హై కోర్ట్ లో రెండు పిల్స్ వేశారని, ఒకటి వాడపల్లి, తొగుమ్మి, మద్దూరు లకు చెందినది, మరొకటి కొవ్వూరు పట్టణానికి, మండకానికి చెందినదని తెలిపారు. అధికారులు ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తూ, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, ఏమైనా అనుమానం వొస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని శ్రీనాథ్ పేర్కొన్నారు. తహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, పశు సంవర్ధక, ఎన్ జి ఓ లతో కూడి మండల స్థాయి లో కమిటీ లు వేసుకుని, రోజువారీ నివేదికను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు సమర్పించాలన్నారు.ఈ సమావేశంలో కొవ్వూరు లో డీఈ హౌసింగ్ సీహెచ్. బాబూరావు, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, మండలాలు నుంచి తహసీల్దార్ లు, ఎంపీడీఓ కు, సి. ఐ. లు, ఎస్.హెచ్.ఓ. (పోలీస్)లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


# అధునాతన ఆప్కో షోరూం ను ప్రారంభం

**ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, జెడ్పి ఛైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు లు హాజరు**

కడప, జనవరి 7సంస్కృతీ, సంప్రదాయాల మేళవింపు, చేనేత కార్మికుల కళా నైపుణ్యం.. ఆప్కో వస్త్రాల సొంతం.. అని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అభివర్ణించారు. శుక్రవారం రాష్ట్ర చేనేత, జౌళి సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నగరంలోని వన్ టౌన్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అధునాతన “ఆప్కో” చేనేత వస్త్రాలయాన్ని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి.. జెడ్పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సి, రాష్ట్ర పద్మశాలీ సంక్షేమ కార్పొరేషన్ చైర్ పర్సన్ జింక విజయలక్ష్మి, రాష్ట్ర ఆప్కో సంస్థ చైర్మన్ చిల్లపల్లి వెంకట నాగమోహన్ రావు, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. × ఈ సందర్భంగా.. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా మగ్గం వృత్తిని, సంప్రదాయ కళనే నమ్ముకుని జీవించే.. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నోవిధాలుగా బాసటగా నిలిచిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ఆర్ హయాంలో.. చేనేత వస్త్రాలకు అపురూపమైన ఆధారణ కల్పించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు వారంలో ఒకరోజు ఖచ్చితంగా చేనేత వస్త్రాలు ధరించాలనే నిబంధన కూడా ఉండేదన్నారు. అదే బాటలో.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేనేత వస్త్రాలకు ప్రపంచస్థాయి గుర్తింపును తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా.. రాష్ట్ర ప్రభుత్వం హాండ్ లూమ్ మరియు హ్యాండి క్రాఫ్ట్ (జౌళి, హస్తకళలు) ఉత్పత్తిదారులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రయోజనాలను చేకూర్చే ఈ–మార్కెటింగ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా నాణ్యతతో కూడిన ఉత్పత్తి, మార్కెటింగ్, పేమెంట్ బ్రిడ్జి అనే మూడు ప్లాట్ ఫాముల ద్వారా నిర్వహించడం జరుగుతోందన్నారు.×ఆప్కో చైర్మన్ చిల్లపల్లి వెంకట నాగమోహన్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేనేత కళాకారులు, ఉత్పత్తులకు మంచి మార్కెట్ ధరలు, చేనేత కుటుంబాల ఆర్థికాభి వృద్ధి కోసం ఆప్కో సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 150 ఆప్కో వస్త్రాలయలు ఏర్పాటు చేయగా.. కడప నగరంలో 151 వస్త్రాలయాన్ని ఈ రోజు ప్రారంభించడం జరిగిందన్నారు. ఆర్థికంగా చితికిపోయి.. కుటుంబ పోషణ కూడా బరువవుతున్న చేనేత కార్మికులకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆపన్నవ3 హస్తం అందిస్తున్నారన్నారు. చేనేత కార్మిక కుటుంబాల సంక్షేమం కోసం.. నాలుగు రకాలైన కార్పొరేషన్లు ఏర్పాటు చేసి.. వారి అభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు.× కడప మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేనేత వృత్తిని ప్రోత్సహించడానికి వివిధ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. వారి ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించడానికే రాష్ట్ర ప్రభుత్వం ఆప్కో ప్రవేశ పెట్టిందన్నారు. నేతన్నలు తయారు చేసిన వస్త్రాలను ఆప్కో ద్వారా కొనుగోలు చేసి విక్రయిస్తుందన్నారు. కష్టపడి తయారు చేసిన చేనేత ఉత్పత్తులను ఉత్పత్తి ధరకే ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాలుగా కార్మికులకు రాయితీలు ఇస్తుందని వివరించారు. ప్రతి వస్త్రంపై 30% రాయితీతో అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడప నగర నడిబొడ్డున కొనుగోలుదారులపై ఎలాంటి అసౌకర్యాలు లేకుండా.. అధునాతన వసతులతో.. అందరినీ ఆకట్టుకునేలా.. సంప్రదాయ వస్త్ర ప్రపంచం మన ముంగిలిలో ఏర్పాటు కావడం జిల్లా ప్రజల అదృష్టం అన్నారు.

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చేనేత వస్త్రాల కొనుగోలుతో నేతన్నలను ఆదుకోవాలన్నారు.×ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సి, రాష్ట్ర పద్మశాలీ సంక్షేమ కార్పొరేషన్ చైర్ పర్సన్ జింక విజయలక్ష్మిలు మాట్లాడుతూ.. మగ్గం వున్న ప్రతి నేత కుటుంబానికి ఏడాదికి “ వైఎస్ఆర్ నేతన్న నేస్తం” పథకం ద్వారా రూ.24000 ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. అలాగే.. గత ప్రభుత్వం ఆప్కో సంస్థకు బకాయిపడ్డ కోట్లాది రూపాయల మొత్తంతో పాటు కోవిడ్–19 నియంత్రణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అందించే ఉచిత మాస్కుల తయారీకి కూడా కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి చేనేత కార్మిక కుటుంబాల్లోనే నవ చైతన్యాన్ని నింపిందన్నారు.ఈ కార్యక్రమంలో అనుడా ఛైర్మెన్ గురుమోహన్, కడప డిప్యూటీ మేయర్లు నిత్యానందరెడ్డి, ముంతాజ్ బేగం, జిల్లా చేనేత జౌలు శాఖ సంబందిత అధికారులు, జిల్లా చేనేత సహకార సంఘాల సభ్యులు, ఆప్కో సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 15 నాటికి ఒమిక్రాన్ ప్రళయం




హైదరాబాద్, జనవరి 7, (న్యూస్ పల్స్)ప్రపంచవ్యాప్తంగా కరోనా అల్లకల్లోలం..లక్షల్లో కేసులు.. అయితే ముందుముందు పెను విపత్తు ముంచుకొస్తోందా..? గతంలో ఎన్నడూ లేని విధంగా ఒమిక్రాన్ ప్రళయం సృష్టించబోతోందా..? రానున్న రోజులన్నీ వెరీ వెరీ డేంజరస్సేనా..? అంటే భయంకర వాస్తవాలను మన కళ్ల ముందుంచుతున్నారు నిపుణులు. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా..జరగబోయే విపత్తును ఊహించలేమంటున్నారు. ఫిబ్రవరిలో కరోనా పీక్స్‌కు చేరుతుందట. ఈ నెల రోజులు అత్యంత కీలకమంటున్నారు వైద్య నిపుణులు. ఫిబ్రవరిలో కొవిడ్ అల్లకల్లోలం సృష్టించడం ఖాయమంటు న్నారు. అంటే ఇప్పటికే ఒక్కరోజులోనే లక్ష కేసులు నమోదవుతున్నాయి. ఇక ఫిబ్రవరిలో పీక్స్‌కు అంటే కేసులు ఎలా ఉంటాయో కూడా ఊహించడం కష్టమేనంటున్నారు. ఇప్పటికే దేశంలో కరోనా థర్డ్ వేవ్ షురూ అయిపోయింది. సెకండ్ వేవ్‌కు మించి డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఎన్నడూ లేని విధంగా రాకెట్ వేగంతో పరుగులు పెడుతోంది. కేవలం 4 రోజుల్లోనే లక్షకు చేరాయి కొవిడ్ కేసులు. 24 గంటల్లోనే 90వేల 928 కరోనా కేసులు నమోదయ్యాయి. మరో 325 మంది కరోనా కాటుకు బలయ్యారు. యాక్టివ్ కేసులు 2,85, 401కి చేరాయి. గత 24 గంటల్లో కొత్తగా 26వేలకు పైగా కొవిడ్ కేసులు నమోదవగా..8 మంది మృతి చెందారు. ఇక డైలీ పాజిటివిటీ రేటు 6.43 శాతంగా ఉంది. ఇక అంతకు మించి అన్నట్టుగా ఒమిక్రాన్ కూడా విలయం సృష్టిస్తోంది. అంతకంతకూ కేసులు పెరిగిపోతున్నాయి. డిసెంబర్ 21న 200 ఒమిక్రాన్ కేసులుంటే..ఇవాళ 2,630కి చేరాయి. అంటే కేవలం 15 రోజుల్లోనే 2,430కేసులు వెలుగులోకొచ్చాయి. దీన్ని బట్టి ఒమిక్రాన్ ఏ స్థాయిలో వ్యాపిస్తుందో అర్థం చేసుకోవచ్చు.ఈ క్రమంలో కోవిడ్ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు డాక్టర్ శశాంక్ జోషి కీలక ప్రకటన చేశారు. ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య తక్కువగా ఉంటే.. ప్రమాదం అంతగా ఉండదని పేర్కొన్నారు. అప్పుడు లక్షణాలు లేని వ్యక్తులు కూడా పరీక్షలకు దూరంగా ఉండచ్చని తెలిపారు. మనమంతా కోవిడ్, వాటి వేరియంట్‌లతో జీవించడం నేర్చుకోవాలంటూ జోషి పేర్కొన్నారు. దాదాపు 15 రోజుల క్రితమే దేశంలో కరోనా థర్డ్ వేవ్ ప్రారంభమైందని పేర్కొన్నారు. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు కరోనా థర్డ్ వేవ్ గరిష్ట స్థాయికి చేరుకుంటుందని పేర్కొన్నారు. కొద్ది రోజుల్లోనే మిలియన్ కేసులు నమోదు అవుతాయని పేర్కొన్నారు. తాజా పరిస్థితులను పరిశీలిస్తే.. దేశం థర్డ్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందన్నారు. మన ఆసుపత్రుల్లోని దాదాపు 80శాతం బెడ్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆక్సిజన్ బెడ్లు, వెంటిలేటర్లను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అనేక అధ్యయనాలు.. ఒమిక్రాన్ వేరియంట్ తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నాయని..జాగ్రత్తముందుకు సాగాలన్నారు.అధ్యయనాలతో పోల్చుకు ంటే.. తీవ్రత తక్కువగానే ఉన్నట్లు తెలిపారు.ఇక ఒమిక్రాన్ ధాటికి ప్రపంచదేశాలన్నీ విలవిలలాడిపోతున్నాయి. ముఖ్యంగా అగ్రరాజ్యం అమెరికా రోజుకు లక్షల్లో నమోదవుతున్న కేసులతో అల్లాడిపోతోంది. తాజాగా 24 గంటల్లో 7లక్షలకు పైగా కేసులు నమోదయ్యాయి. ఇక ఫ్రాన్స్‌లోనూ సేమ్ సీన్. న్యూ వేరియంట్ ఇహూ తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో అక్కడ ఒక్కరోజులోనే 3లక్షల మందికి పైగా కరోనా సోకింది.కేసులు పెరుగుతుం డటంతో అప్రమత్తమైన ప్రభుత్వాలు కరోనా కట్టడి చర్యలు చేపట్టాయి. ఆంక్షలు అమలు చేస్తున్నాయి. అయితే.. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా కేసులు పెరుగుతున్నాయన్నది వాస్తవం. మనం బ్రతకాలంటే జాగ్రత్తలు మస్ట్. రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకున్నా..ఏ మాత్రం నిర్లక్ష్యం వద్దు. మాస్క్ ధరించడం, ఫిజికల్ డిస్టెన్స్ కంపల్సరీ. లేదంటే భారీ మూల్యం తప్పదంటున్నారు వైద్య నిపుణులు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

### ఒకరి మృతి ఒకరి పరిస్థితి విషమం

చిత్తూరు చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం మద్రాస్ బాంబే జాతీయ రహదారి పత్రాపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరోకరికి తీవ్రగాయాలయ్యాయి. పుంగనూరు పట్టణం దూల వాండ్ల ఇండ్లు కు సుబ్రహ్మణ్యం (22), నాగమణి (24) ద్విచక్ర వాహనంలో మదనపల్లె కు వెళ్లి తిరిగి వస్తుండగా పత్రాపల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతోనాగమణి 24 సంవత్సరాలు అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. స్థానికులు హుటాహుటిన గాయపడ్డ సుబ్రమణ్యం ను ఆసుపత్రికి తరలించారు సుబ్రమణ్యం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం పెద్ద జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## గోపాలమిత్ర ల సమస్యలు పరిష్కరించాలి

కడప జనవరి 07: కడప నగరంలోని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కి గోపాలమిత్ర సమస్యలు పరిష్కరించాలని పత్రం ఇవ్వడం జరిగింది పశు సంవర్ధక శాఖలో గత 20 సంవత్సరాల నుండి గోపాల మిత్రులు గా గ్రామీణ ప్రాంతంలో ఉండే రైతులకు సేవలు చేస్తూ ఉన్నారు . అటువంటి గోపాల మిత్రులు సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనురు శ్రీనివాసులు రెడ్డి యూనియన్ అధ్యక్షులు మల్లేష జాయింట్ డైరెక్టర్ గారిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ప్రధానంగా గోపాల మిత్రులకు 6500 రూపాయలు వేతనం ఇస్తున్నారు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలనే. రైతు భరోసా కేంద్రానికి అప్పజెప్పాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తా ఉన్నది రైతు భరోసా కేంద్రం లో పని చేయడానికి అభ్యంతరం లేదని కానీ వేతనం కేవలం 6500 మాత్రమే ఇస్తామని చెప్తున్నారు అది కూడా మాకు 6500 చాలు అనే అంగీకార పత్రం పైన సంతకాలు చేయాలని అధికారులు కోరుతున్నారు మేమైతే రైతు భరోసా కేంద్రాలు పని చేయడానికి ఎటువంటి అభ్యంతరం లేదు రైతు భరోసా కేంద్రాలు వెళ్లేముందు అందర్నీ ఏ పి సి ఓ ఎస్ లోకి తీసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నాం ఈ అంశాలపైన జెడి గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది వారు పరిశీలించి వానికి ఆర్థిక శాఖకు పంపిస్తామని మాకు హామీ ఇవ్వడం జరిగింది ప్రధానమైన సమస్యలు మిత్రులందరికీ వ్యక్తిగత 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి పెట్రోల్ అలవెన్స్ ఇవాలి విధినిర్వహణలో కాలు, చెయ్యి కి నష్టం జరిగితే నష్ట పరిహారం చెల్లించాలి అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని , అధికారులకు ఈ రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించడం అయినది.

## కృష్ణ చైతన్యలో సంక్రాంతి సంబరాలు- ముగ్గుల పోటీలు.

నెల్లూరు జనవరి 7స్థానిక కరెంట్ ఆఫీస్ సెంటర్ ప్రాంతంలో ఉన్న కృష్ణ చైతన్య కళాశాల ప్రాంగణంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. అందులో భాగంగానే విద్యార్థినీలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పాయసం మహేష్ మాట్లాడుతూ కృష్ణ చైతన్య కళాశాలల డైరెక్టర్లు ఆర్ వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్ రెడ్డి లు విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక కార్యక్రమాలలోనూ తర్ఫీదు ఇచ్చేందుకు సహకారం అందిస్తున్నారని వారి సేవలను కొనియాడారు. ఇందులో భాగంగానే గత 2 సంవత్సరాలుగా కరోనా నేపథ్యంలో నిర్వహించ లేకపోయినా ముగ్గుల పోటీలను 2022 సంక్రాంతి సంబరాలను గుర్తు చేసుకుంటూ, విద్యార్థినీలను ప్రోత్సహించే దిశగా ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ శిరీష, అకడమిక్ డీన్ రాం గోపాల్ రెడ్డి,అడ్మిన్ డీన్ జి.ఉమ తదితరులు పాల్గొన్నారు.

## మ్యాచింగ్ గ్రాంట్ చెక్కును అందజేసిన జిఎం శ్రీనివాస్

మందమర్రి.జనవరి 07మందమర్రి ఏరియాలోని వర్క్ షాప్ లో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన సంపత్ కుటుంబ సభ్యులకు శుక్రవారం వర్క్ షాప్ లో మ్యాచింగ్ గ్రాంట్ చెక్కును అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల నుండి సోషల్ సెక్యూరిటీ ఫండ్ ద్వారా రికవరీ అయిన మెత్తం 10.49.751 రూపాయల చెక్కు, కంపెనీ ద్వారా అందిచ్చె 10 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ ఫిక్స్ డిపాజిట్ చెక్కును మృతుడు సంపత్ భార్య సుకన్య కు అందజేయడం జరిగిందని తెలిపారు.అలాగే సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగికి ఇలాంటి ఆపద ఎదురైనప్పుడు వారికి సింగరేణి సంస్థ ఎప్పుడూ తోడుగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో టిబిజికెఎస్ ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ శర్మ,డివైజిఎం వర్క్ షాప్ నరసింహ రాజు,టిబిజికెఎస్ ఫిట్ సెక్రెటరీ కొండల్ రావు, వర్క్ షాప్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పోలవరంపై భేటీ

ఏలూరు జనవరి 7 పోలవరం ప్రాజెక్టు నిర్మాణం అంశంపై డామ్ డిజైన్స్ రివ్యూ ప్యానెల్ (డీడీఆర్పీ) సమావేశం నిర్వహించారు. డీడీఆర్పీ చైర్మన్ ఏబీ పాండ్య అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దీనిపై చైర్మన్ ఏబీ పాండ్య మాట్లాడుతూ, 2022 నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని వెల్లడించారు. నిర్మాణ పనులపై అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించామని తెలిపారు. పనులు సంతృప్తికరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ప్రపంచంలోనే అతిపెద్ద గేట్లను ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. గేట్ల బిగింపు, అమరిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశామని ఏబీ పాండ్య చెప్పారు.కాగా, డీడీఆర్పీ బృందం నిన్న పోలవరం ప్రాజెక్టును సందర్శించి అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించింది.

# బీచ్ లో పర్యాటకులు కొవిడ్ నిబంధనలు పాటించాలి :: జిల్లా కలెక్టర్

విశాఖపట్నం, జనవరి 7 జిల్లాలో కోవిడ్ కేసులు పెరుగుతున్నదృష్ట్యా జిల్లా ప్రజలందరూ కోవిడ్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని జిల్లా కలెక్టరు డా.ఎ.మల్లిఖార్జున విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉదయం కలెక్టరు, జాయింట్ కలెక్టరు పి.అరుణ్ బాబు, జి.వి.ఎం.సి కమిషనరు లక్ష్మీశ లతో కలసి జిల్లాలో పలు ప్రాంతాలలో పర్యటించారు. ముందుగా రామకృష్ణా బీచ్ లో పరిశీలించి పలు చోట్ల అవుట్ పోస్టులు ఏర్పాటు చేయాలని జి.వి.ఎంసి అధికారులకు సూచించారు. అక్కడ పోలీసు, జి.వి.ఎం .సి సిబ్బంది విధులను నిర్వహిస్తూ పర్యాటకులకు కోవిడ్ నిబంధనలపై అవగాహన కలిగించాలన్నారు. రామకృష్ణా బీచ్ లో కూర్చుని ఉన్నపర్యాటకులను చూసి వారితో చర్చించారు. తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చు పర్యాటకులు కోవిడ్ నిబంధనలు పాటించక పోతే ఇక్కడ మరియు వారి ప్రాంతాలలోని ప్రజలకు కూడా కోవిడ్ సోకే ప్రమాదం ఉందన్నారు. తదుపరి కలెక్టరు ఆరిలోవ వార్డు 13 నందలి హుద్ హుద్ ఇళ్లను పరిశీలించారు. అక్కడ పరిసరాలను పరిశుభ్రంగావించాలని ప్రతి యింటిని పరిశీలించి కోవిడ్ కేర్ సెంటరుగా మార్చడానికి తగు ఏర్పాట్లు గావించాలని జి.వి.ఎం .సి అధికారులకు సూచించారు. విమ్స్ ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టరు అక్కడి వైద్యులను రోగులకు అందిస్తున్న సేవలు, ఒ.పి., డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నిల్వ ఉన్న ఆక్సిజన్ సిలిండర్లు, వాటి సామర్ధ్యము వినియోగపు వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అవసరమైన స్థాయిలో ఎల్.ఎమ్.వో. ట్యాంకులు, ఆక్సిజెన్ సిలెండర్లు వున్నాయని, మూడవ వేవ్ ను ఎదుర్కోడానికి సిద్ధంగా వున్నామంటూ సంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి కలెక్టరు కె.జి.హెచ్ కు వచ్చి వైరాలజీ ల్యాబ్ ను పరిశీలించారు. వైరాలజీ ల్యాబ్ లో ఆర్.టి.సి.పి.సి.ఆర్. టెస్టుల సంఖ్య పెంచాలన్నారు. జినోమ్ సీక్వెన్సీ టెస్ట్ కు ఏర్పాట్లు గావించాలన్నారు. సి.ఎస్.ఆర్ బ్లాక్ ను పరిశీలించి అక్కడి బెడ్స్, ఇతర సౌకర్యాలు, వివరాలను అడిగి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరు ఎ.ఎం .సి ప్రిన్సిపల్ ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు. కోవిడ్ టెస్టులు, రిపోర్టులు, హోమ్ ఐసోలేషన్ లో ఉన్న వారికి వైద్య సేవలు, డేటా, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. మార్చురీ నిర్వహణ, పోస్ట్ మార్టెమ్ లు, ఫోరెన్సిక్ సిబ్బంది, తదితర అంశాలపై చర్చించారు. కేసులు అధికంగా వస్తే వాటిని తట్టుకుని ఎలా వైద్య సేవలు అందించాలో చర్చించి పలు సూచనలు చేశారు. కె.జి.హెచ్. లో మార్చురీని అభివృద్ధి చేయాలంటూ అందుకు కావలసిన నిధులు మంజూరు చేస్తామన్నారు. ఫిబ్రవరి నెల నుండి రాత్రి షిఫ్ట్ లో కూడా పోస్ట్ మార్టమ్ లు నిర్వహించాలన్నారు. అందుకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు గావించాలని ఆంధ్రా మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ ను, కె.జి.హెచ్. సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ఈ సందర్భముగా కలెక్టరు జి.వి.ఎం .సి కమిషనర్ కు మరియు వైద్యాధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు పి.అరుణ్ బాబు, జి.వి.ఎం .సి కమిషనరు లక్ష్మీశ, ఎ.పి.ఎస్.ఎం,డి.సి ఇఇ నాయుడు, జి.వి.ఎం .సి అదనపు కమిషనరు శ్రీనివాస్, ఎ.ఎం.సి ప్రిన్సిపాల్ డా.సుధాకర్, కె.జి.హెచ్ సూపరింటెండెంట్ డా. మైథిలి, డా.దేవిమాధవి, తదితరులు పాల్గొన్నారు.

# 17 వ రోజుకు చేరిన రిలే దీక్షలు.

నంద్యాల జనవరి 7 మదరసా అరబియా దారుల్ అమన్ ను రక్షించండి.. అవినీతి అధికారులను శిక్షించండి" అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహమ్మద్ గారి ఆధ్వర్యంలో నంద్యాలలో తలపెట్టిన 17 వ రిలే నిరాహార దీక్షా చేపట్టడం జరిగింది. ఈ దీక్షలో కూర్చున్న వారు టిడిపి ఏడవ వార్డు టిడిపి ఇన్చార్జ్ మస్తాన్ ,మాజీ కో-ఆప్షన్ ఖలీల్ , టిడిపి కౌన్సిలర్లు మహబూబ్ వలీ నాగార్జున, , ఖాజా మౌలానా, ముస్లిం మత పెద్దలు టిడిపి కార్యకర్తలు విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు కూర్చడం జరిగింది. ఈ దీక్షలకు ప్రారంభం మౌలానా ముస్తాక్ అహ్మద్ ప్రారంభించారు. ఈ దీక్షలకు అధ్యక్షత రషీద్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూరాష్ట్రంలో అధికార పార్టీ నాయకులు కక్ష సాధింపు చర్యలు, మదరసాలపై జరిపే దాడులు ఆపాలి. రాష్ట్రంలోని వక్స్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలి. కర్నూలు జిల్లాలో వక్ఫ్ బోర్డు ఆస్తులను రక్షించలేని అవినీతి అధికారి డీమ్ డబ్యుఓ . మహబూబ్ బాష ఆస్తులపై దర్యాప్తు జరిపి ఉద్యోగం నుండి తొలగించాలని ముస్లిం మైనారిటీ సోదరులు డిమాండ్ చేస్తున్నారు . రాబోయే రోజుల్లో వైఎస్ఆర్సిపి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని వారు తెలిపారు. ఈ దీక్షకు మద్దతు తెలిపిన వారు కడప టిడిపి అనుబంధ ప్రజా సంఘాలు టీ యన్ టి యు సి టిడిపి కార్యకర్తలు నాయకులు, అవాజ్ జిల్లా కన్వీనర్ మస్తాన్ వలి, , అవాజ్ పట్టణ అధ్యక్షులు బాబుల్లా, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# లిన గిరిజనుల ఆత్మీయ అభినందన సభను జయప్రదం చేయండి...

## గిరిజనులకు రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ పిలుపు.....

నంద్యాల జనవరి 7అనంతపురం లోని జిల్లా పరిషత్ హాల్ లో ఈనెల 9న గిరిజనుల ఆత్మీయ అభినందన సభ నిర్వహిస్తున్నట్లు జి పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తెలిపారు. గురువారం నంద్యాల పట్టణంలోని స్థానిక జిపిఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గిరిజనుల ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడమైందని వారన్నారు. అనంతపురం జిల్లాలో గెలుపొందిన గిరిజన సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లను ఎంపీపిలను అభినందించే ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ హాల్ లో నిర్వహించే అభినందన కార్యక్రమానికి రాష్ట్రంలో ఉన్న గిరిజన ప్రజా సమాఖ్య నాయకులతో పాటు వివిధ గిరిజన సంఘాల నాయకులు, మహిళలు ప్రజలు పాల్గొని సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అనంతపురం ప్రాంతంలో అధిక శాతం గిరిజనులు నివసిస్తూ ఉండడంతో ఈ భారీ సభను అక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు వారు అన్నారు అదేవిధంగా బంజారా సంస్కృతి సంప్రదాయాలతో చిన్నారుల ఆట పాటలు బంజారా వేషధారణతో అందర్నీ అలరింప చేసే కల్చరల్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజనులు ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని ఆయన మీడియా ద్వారా పిలుపునిచ్చారు

# గర్భ సమయం లో దూరంగా ఉండవల్సిన ఆహారపదార్థాలు ఇవే




స్త్రీ జీవితంలో గర్భదశ చాలా ముఖ్యమైన సమయం. కారణం- ఈ దశలో శరీరంలో జరిగే మార్పులు మరియు సమస్యలు ఊహకు అందని విధంగా ఉంటాయి. గర్భవతులు స్వతహాగా చాలా జాగ్రత్తలు తీసుకోవటం చాలా ముఖ్యం మరియు ఆహార సేకరణలో జాగ్రత్తలు వహించటం చాలా అవసరం. గర్భ సమయంలో దూరంగా ఉండవలసిన ఆహార పట్టిక పెద్దదిగానే ఉంది. అయితే, గర్భ సమయంలో మీరు అనుసరించే ఆహర ప్రణాళికలో వీటికి దూరంగా ఉండేలా చూసుకోండి. బద్దకము వలన కడగటం మానేసినట్లయితే, మీరు చాలా ఇబ్బంది గురి అవ్వాల్సి వస్తుంది. కావున మీరు తినటానికి ముందు, కేవలం రెండు సార్లు అయిన కడగండి. మీరు తీసుకునే ఆహారం కడుపులో ఉన్న పాపకి అందించబడుతుంది, వాటిలో బ్యాక్టీరియా మరియు ధుమ్ము, ధూళి ఉండే అవకాశం ఉంది కావున శుభ్రంగా కడిగి తినటం మంచిది. మామూలు జున్నుతో పోల్చినట్లయితే చిక్కని జున్ను చాలా విధాలుగా గర్భినులకు నష్టం కలిగిస్తుంది. కావున చిక్కని జున్నుని తినడం వలన మీ శరీరంలో జరిగే మార్పులకు అసౌకర్యంగా భావిస్తారు. ముఖ్యంగా శరీర నిరోధక శక్తి మీలో పెరుగుతున్న పిండానికి రక్షణ కలిపిస్తుంది. బ్రీ, కామేమ్బెర్ట్, ఫెటా, క్వేసో బ్లాంకో, బ్లెవు వంటివి ఎక్కువ జున్నుని కలిగి ఉంటాయి. పచ్చి మాంసము, పచ్చి గ్రుడ్డు గర్భ సమయంలో సాల్మొనెల్లా వలన కలిగే వ్యాధులను కలుగచేస్తాయి. కావున గ్రుడ్డు మరియు పిండితో చేసిన ఆహార పదార్థాలను తినకండి. ఇంకా కస్టర్డ్స్, ఇంట్లో చేసే పిండి పదార్థాలు, కేక్ బట్టర్, ఇంట్లో చేసే ఐస్ క్రీమ్స్, ఎగ్నాగ్, మాయో.. వంటివి కూడా తినకండి.ఇది గర్భ సమయంలో తీసుకొకూడని పట్టికలో మొదటగా ఉంటుంది. దీనిని తినటం వలన గర్భ సమయంలో లేదా శిశు జనన సమయంలో అధిక స్రావానికి గురిచేస్తుంది. బొప్పడి పండు ఎక్కువ 'లాటేక్స్'ని కలిగి ఉంటుంది, ఇది గర్భాశయాన్ని సంకోచాలకు గురిచేస్తుంది. గర్భం ధరించిన మూడు నెలల తరువాత దీన్ని తినకూడదు. దీన్ని తేనె లేదా పాలతో కలిపి తీసుకోవటం వలన దీని శక్తి మరింతగా పెరుగుతుంది. గర్భంతో ఉన్నపుడు షుగర్ ఫూడ్'ని ఎక్కువగా తినకూడదు. వైద్యుడు తెలిపిన విధంగా 9 నెలలు కాకుండా, సరిపోయేంత షుగర్'ని తీసుకుంటే సరిపోతుంది. గర్భ సమయంలో ఎక్కువగా షుగర్ తీసుకోవటం మచిది కాదు అని ప్రయోగాత్మకంగా నిరూపించబడింది. డెలి మాంసాలు 'లిస్టిరియాసిస్'లను కలుగ చేసే వాటితో ప్యాక్ చేయబడి ఉంటాయి. ఇవి గర్భాన్ని నిరోధించే పదార్థాలను కలిగి ఉంటాయి కావున వీటిని గర్భ నిరోధక ఆహార పట్టికలలో చేర్చారు. కారణం ఇవి శరీరంలో వేడిని 165 డిగ్రీల వరకి పెంచి, మీకు మరియు మీ కడుపులో పెరుగుతున్న శిశువుకి హాని కలిగిస్తాయి. కావున గర్భ సమయంలో వీటికి దూరంగా ఉండండి. ఇక్కడ తెలిపిన ఆహారాలు గర్భ సమయంలో చాలా సమస్యలను గురి చేస్తాయి, కావున మీరు తినే ప్రతి ఆహర పదార్థం గురించి పూర్తీ అవగాహన ఉండాలి. ఈ ఆహార పదార్థాల వలన మీ ఆరోగ్యం మాత్రమె కాకుండా, గర్భాశయంలోని శిశువు ఆరోగ్యం కూడా పాడవుతుంది. కావున వీటికి దూరంగా ఉండండి.

# కిడ్నీలను సహజంగా శుభ్రపరుచుకొండిలా

కిడ్నీలు శరీరం లో ఉండే అతి ముఖ్య అవయవాలలో ఒకటి. రక్తం లోని వివిధ మలినాలను తొలగించి రరక్తాన్ని శుభ్రపరచడం వీటి ప్రధాన భాద్యత. ఇవి కూడా నిరంతరం పనిచేస్తూనే ఉంటాయి. మలినాలు తొలగించే ప్రక్రియ లో విట్లో మలినాలు నిక్షిప్తమై రాళ్ళు, ట్యూమర్ లు రావొచ్చు. అందకే వీటిని తరుచు డిటాక్స్ చేయం మంచిది. సహజంగా కిడ్నీ లను డిటాక్స్ చేయడం ఎలాగో చూద్దాం. కిడ్నీ లను సులభంగా శుబ్ర పరచగల ఒకే ఒక సాదనం మంచి నీళ్ళు. దాదాపు గ 8 నుండి 10 గ్లాస్ ల వరకు రోజు తాగండి. ఇతరత్రా సమస్యలేం లేకుంటే ఇంకా ఎక్కువ కూడా తాగవచ్చు. నీళ్ళు టాక్సిన్ పదార్థాలను ఫిల్టర్ చేసినట్టుగా తొలగించేస్తుంది. మీ మూత్రం క్లియర్ గ, ఎటువంటి దుర్వాసన లేకుండా ఉంటె మీరు సరిపడ నీరు తాగుతున్నరన్నమాట, లేకపోతే మీరు ఇంకా నీళ్ళు తాగాలి అన్నట్టు. ఫ్రెష్ పండ్లు, కూరగాయలు, ముఖ్యంగా పొటాషియం ఎక్కువగా ఉన్న వాటిని రోజువారీగా తీసుకుంటూ ఉండండి. గ్రేప్స్,ఆరెంజేస్, బనన, కివి, అప్రికాట్ లాంటివి పొటాషియం కు మంచి సోర్స్. పాలు, పెరుగు లలో కూడా పుష్కంగానే ఉంటాయి. ముఖ్యంగా, వివిద్ద రకాల బెర్రీస్, ఎందుకంటే వీటిలో ఉండే క్వినైన్ మెటబాలిజం లో హిప్పురిక్ ఆసిడ్ గ మారి కిడ్నీ లను సమర్దవంతంగా శుబ్రం చేస్తుంది. బార్లీ దాన్యం కిడ్నీ లను శుభ్రపరచడమే కాదు, ప్రమాదాల బారి నుండి కాపాడగల సామర్ధ్యం కలిగి ఉంటుంది. ఇది ఫైబర్ ఎక్కువగా ఉండే ఒక హోల్ గ్రైన్. ఇది ఇంకా డయాబెటిస్ లాంటి వాటినుండి కూడా సమర్దవంతంగా రక్షిస్తుంది. కొన్న బార్లీ గింజలను రాత్రిళ్ళు నీళ్ళల్లో నానేసి, ఉదయాన్నే ఆ నీటిని త్రాగడంవాళ్ళ బార్లీ లోని మంచి గుణాలను పూర్తిగా స్వీకరించవచ్చు. ఆల్కహాల్, చాకొలేట్ , కేఫ్ఫిన్ ల వాళ్ళ చాల దుష్ప్రభావాలు ఉన్నాయి, ఒక కిడ్నీ ల పైనే కాదు, ఓవర్ అల్ ఆరోగ్యం పై కూడా వీటి నెగటివ్ పలితాలు కనిపిస్తున్నాయి. వీటిని అరిగించే, కరిగించే క్రమంలో కిడ్నల పై చాల ప్రభావం పడుతుంది . దీనితో కిడ్నీ ల పనితీరు తగ్గిపోతుంది. అందుకే, వీటికి దూరంగా ఉండం మంచిది.


# బాలయ్యది కూడా పాన్ ఇండియా రూటేనా ...?



బాలయ్యది రెండేళ్ళు తక్కువ అయిదు దశాబ్దాల సుదీర్ఘమైన సినీ కెరీర్. వందకు పైగా సినిమాలు. అందులో బ్లాక్ బస్టర్ హిట్లు ఇండస్ట్రీ హిట్లు రికార్డులను తిరగరాసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. బాలకృష్ణ పక్కా తెలుగు హీరో. ఆయన చేయాలనుకుంటే అప్పట్లోనే హిందీ సినిమాలు చేసేవారు. కానీ ఆయన నో బాలీవుడ్ ఓన్లీ టాలీవుడ్ అనేసుకున్నారు. ఆయన తరం హీరోలు చిరంజీవి నాగార్జున వెంకటేష్ బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చినా ఆయన మాత్రం ఆ వైపు చూడలేదు. అలాంటి బాలయ్య ఇపుడు పాన్ ఇండియా అంటున్నారు. ఆయన లేటెస్ట్ హిట్ అఖండ తో నిర్మాతల దర్శకుల ఆలోచనలు ఒక్కసారిగా మారిపోయాయి. అఖండ డబ్ చేయకుండానే మిగిలిన సౌతిండియా ఏరియాల్లో రిలీజ్ చేస్తే మంచి రెస్పాన్స్ వచ్చిందట. స్టామినా ఉన్న మాస్ హీరో బాలయ్యతో పాన్ ఇండియా లెవెల్ మూవీ చేస్తే కలెక్షన్లు కుమ్మేయడం ఖాయమన్న ధీమా వారిలో కలిగింది. ఇక మైత్రీ మూవీస్ పతాకం మీద బాలయ్య గోపీచంద్ మలినేనితో చేస్తున్న సినిమా పాన్ ఇండియా రేంజిలో ఉండేలా డిజైన్ చేస్తున్నారని టాక్ నడుస్తోంది. ఈ మూవీలో అందుకే ఏరి కోరి సౌతిండియా నటులను తీసుకున్నారని చెబుతున్నారు. బాలయ్యకు సరిసాటి విలన్ గా కన్నడ నటుడు దునియా విజయ్ ని తీసుకున్నారు. ఆయనకు అక్కడ ఫాలోయింగ్ చాలా ఉంది. దాంతో కర్నాటకలో కూడా ఈ మూవీని డబ్ చేయడానికి ముందే ప్లాన్ అంటున్నారు. అదే విధంగా కోలీవుడ్ కి చెందిన ఇద్దరు భామలు ఈ సినిమాలో మెరవనున్నారు. బాలయ్య పక్కన విశ్వనటుడు కమల్ హాసన్ గారాల పట్టి శృతి హాసన్ హీరోయిన్ గా నటిస్తున్నారు. అలాగే లేడీ విలన్ గా బాలయ్యను ఢీ కొట్టే పాత్రలో వరలక్ష్మి శరత్ కుమార్ నటిస్తున్నారు. ఈ ఇద్దరూ కూడా కోలీవుడ్ మార్కెట్ పెంచడానికే అంటున్నారు. ఈ మూవీ కథ కూడా కర్నాటక బోర్డర్ లో సాగుతుంది అని చెబుతున్నారు. ఇక బాలయ్య చాలా కాలం తరువాత తండ్రీ కొడుకులుగా నటిస్తున్న మూవీ ఇదే. తండ్రి బాలయ్య పక్కన విజయశాంతి అని అనుకుంటున్నారు. ఆమె నో అంటే ఉత్తరాదికి చెందిన సీనియర్ హీరోయిన్ ని తేవాలనుకుంటున్నారుట. అలా పాన్ ఇండియాకు సరిపోయే విధంగా నటీనటులను ఎంపిక చేసి పెట్టుకున్నారు. పక్కా మాస్ యాక్షన్ తో పాటు ఫ్యామిలీ ఎమోషన్ని టచ్ చేస్తూ ఈ మూవీ కంటెంట్ ఉంటుంది అంటున్నారు. బాలయ్య ఇమేజ్ ని వేరే లెవెల్ లో ప్రెజెంట్ చేయడానికి గోపీ చంద్ మలినేని సిద్ధంగా ఉన్నారు. ఈ మూవీ దసరాకు రిలీజ్ అంటున్నారు. తెలుగుతో పాటు తమిళ్ కన్నడ మలయళం నార్త్ ఇండియా లో మూవీ రిలీజ్ చేయడానికి మేకర్స్ చూస్తున్నారు.

# 2021 సెలబ్రిటీలకు టూ బ్యాడ్ టైమ్!

గతేడాది కొంత మంది సినీ ప్రముఖులకు చేదు అనుభవాల్ని మిగిల్చింది. ఏడాది ఎండింగ్ అనుకోని ఘటనలతోనే ముగించాల్సి వచ్చింది. ముఖ్యంగా బాలీవుడ్ సెలబ్రిటీల్లో ఇయర్ ఎండ్ టెన్షన్స్ ఊపిరాడనివ్వలేదు. కొందరు టాలీవుడ్ సెలబ్రిటీలు డ్రగ్స్ కేసులో ఈడీ విచారణని ఎదుర్కొనగా.. అటు బాలీవుడ్ సెలబ్రిటీలు ఇలాంటి విచారణను ఎదుర్కొన్నారు. ఓ స్టార్ హీరో కుమారుడైతే ఏకంగా జైలు జీవితమే గడపాల్సి వచ్చింది. ఇంకా పలువురు సెలబ్రిటీలు వివిధ వివాదాలతో ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఓసారి ఆ జాబితా పరిశీలిస్తే...కింగ్ ఖాన్ వారసుడు ఆర్యన్ ఖాన్ డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయి జైలుకెళ్లారు. 26 రోజుల పాటు జైలు జీవితం గడపాల్సి వచ్చింది. ఎంతో కష్టం మీద బెయిల్ దొరికింది. కేవలం ఆరోపణల కారణంగానే ఆర్యన్ ఖాన్




ఇలాంటి విపత్కర పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది. షారుక్ ఫ్యామిలీకి ఇదొక చేదు సంఘటన. అలాగే ఈ కేసుతో నటి అనన్య పాండేకు సంబంధాలు ఉన్నట్లు సందేహం రావడంతో ఎన్ సీబీ అమెని కూడా విచారించింది. రైతు ఉద్యమానికి మద్దతుగా రిహానా ట్వీట్ చేసిన తర్వాత చాలా మంది ప్రముఖులు హ్యాష్ ఇండియా 'ఎగైనెస్ట్ ప్రాపగండ' హ్యాష్ ట్యాగ్ ని ట్వీట్ చేసిన వారి లో అక్షయ్ కుమార్.. అజయ్ దవగణ్ కుడా ఉన్నారు. దీంతో ఆ హీరోలు నటించిన 'బెల్ బాటమ్'..'సూర్యవంశీ' చిత్రాలు పంజాబ్ లో సమస్యలు ఎదుర్కొన్నాయి. ఇక శిల్పాశెట్టి భర్త రాజ్ కుంద్రా నీలి చిత్రాల కేసులో అరెస్ట్ అయ్యారు. జులై లో చాలా కాలం గడిపాక.. సెప్టెంబర్ లో బెయిల్ వచ్చింది. రాజ్ కుంద్రా రహస్య వ్యాపారం బయటపడటంతో శిల్పాశెట్టి కెరీర్ పైనా దెబ్బపడింది. ఇక జాక్వెలిన్ పెర్నాండేజ్..నోరా పతేహీ 200 కోట్ల కుంభకోణంలో ఈడీ విచారణను ఎదుర్కొంటున్నారు. సుకేష్ చంద్ర శేఖర్ తో వాళ్లిద్దరికి ఉన్న సన్నిహిత సంబంధాలు కారణంగానే ఈ భామలు లాక్ అయ్యారు. ఇక యువ నటుడు కార్తిక్ ఆర్యన్ ని నిర్మాత కరణ్ జోహార్ తన సినిమా 'దోస్తానా-2 'నుంచి తప్పించారు. సగం షూటింగ్ చేసిన తర్వాత కార్తిక్ ని తప్పించి సంచలనం సృష్టించారు. ఆనంద్ ఎల్. రాజయ్ ప్రాజెక్ట్ ల నుంచి కూడా కార్తీక్ తప్పుకున్నట్లు ప్రచారం సాగుతోంది. అందులో వాస్తవం ఏమిటన్నది తేలాల్సి ఉంది. ఇక కరీనాకపూర్-సైఫ్ అలీఖాన్ దంపతులకు జన్మించిన రెండవ బిడ్డ పేరు విషయంలో వివాదం తలెత్తింది. .జెహ్ జాహంగీర్ అనే పేరు పెట్టడంతో నెటి జనులు విమర్శనాస్త్రాలు విసిరారు. దీంతో పేరులో మార్పులు చేసారు. కరణ్ జోహార్ ఇంట్లో జరిగిన పార్టీలో కరోనా కలకలం రేపింది. చాలా మంది బాలీవుడ్ సెలబ్రిటీలు వైరస్ బారిన పడటంతో ఆ ఇంటిని పూర్తిగా మూసివేసారు. దీంతో కరణ్ పై అంతా దుమ్మెత్తిపోసారు. సైఫ్ అలీఖాన్ 'తాండవ్' వెబ్ సిరీస్ పెద్ద వివాదానే ఎదుర్కోంది. మతపరమైన మనోభావాలు దెబ్బ తీసే అంశాలు 'తాండవ్' లో ఉండటంతో సైఫ్ క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది.

# థర్టీప్లస్ దాటాకే క్రేజీ హీరోయిన్ పెళ్లంట

మన పక్కింటి అమ్మాయిలా వుందే అని ప్రతీ ఆడియన్ ఫీలయ్యేలా తనదైన నటనతో ఆకట్టుకుంటోంది సాయి పల్లవి. మలయాళ మూవీ 'ప్రేమమ్'లో మలర్గా మెస్మరైజ్ చేసిన సాయి పల్లవి తెలుగు ప్రేక్షకుల్ని కూడా 'ఫిదా' చేసిన విషయం తెలిసిందే. సహజమైన నటనతో ఆకట్టుకుంటూ ప్రేక్షకుల



హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంది. తెలుగులో ఆమె చేస్తున్న చిత్రాలు వరుసగా సూపర్ హిట్ లుగా నిలుస్తున్నాయి.'పడి పడి లేచే మనసు' తప్ప తెలుగులో సాయి పల్లవి చేసిన సినిమాలన్నీ సూపర్ హిట్ లే. రీసెంట్ గా లవ్ స్టోరీ శ్యామ్ సింగ రాయ్ చిత్రాలతో మరోసారి వరుస విజయాల్ని తన ఖాతాలో వేసుకుంది. నానితో గతంలో 'ఎంసీఏ' చేసిన సాయి పల్లవి తాజాగా 'శ్యామ్ సింగ రాయ్'తో ఆ మ్యాజిక్ని రిపీట్ చేసింది. టైమ్ ట్రావెల్ కథగా పిరియాడిక్ బ్యాక్ డ్రాప్లో రూపొందిన ఈ మూవీ గత ఏడాది డిసెంబర్ 24న విడుదలై బాక్సాఫీస్ వద్ద నాలుగు భాషల్లో అనూహ్య విజయాన్ని సాధిస్తోంది. ఈ చిత్రంలో సాయి పల్లవి రోజీగా దేవదాసీ పాత్రలో నటించి మెప్పించింది. అచ్చం బెంగాలీ యువతిగా కనిపించి మెస్మరైజ్ చేసింది. ఈ సందర్భంగా తన పాత్రకు లభిస్తున్న ప్రశంసలతో పాటు సినిమా సక్సెస్ ని ఎంజాయ్ చేస్తున్న సాయి పల్లవి తాజాగా తన పెళ్లి ఎప్పుడో చెప్పేసింది. సినిమా ప్రమోషన్స్ లో బిజీగా వున్న సాయి పల్లవి వరుసగా పలు మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇస్తోంది. ఈ సందర్భంగా ఆమెని పెళ్లి గురించి ప్రశ్నించారు. అయితే ఈ ప్రశ్నకు తనదైన స్టైల్లో స్పందించింది. ఇంకా తన వయసు 29నే అని 30 ఏళ్ల తరువాతే తాను పెళ్లి గురించి ఆలోచిస్తానని స్పష్టం చేసింది. అంటే సాయి పల్లవి థర్టీ ప్లస్ వచ్చేంత వరకు తాను పెళ్లి చేసుకోనని చెప్పిందన్నమాట. ఈ విషయం తెలిసి ఆమె అభిమానులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. సాయిపల్లవి అప్పుడే పెళ్లి చేసుకుని సినిమాలకు ఫుల్ స్టాప్ పెట్టేస్తే మా పరిస్థితి ఏంటని అందుకే ఆమె ఇప్పట్లో పెళ్లి చేసుకోనని చెప్పడం మాకు ఆనందాన్ని కలిగిస్తోందని చెబుతున్నారు.

# క్రికెట్ అభిమానులకు బ్యాడ్ న్యూస్... ఇక ఆ సిరీస్ కూడా కష్టమే!



దక్షిణాఫ్రికా పర్యటన ముగిసిన తర్వాత టీమిండియా స్వదేశంలో వెస్టిండీస్‌తో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. అయితే ప్రస్తుతం భారత్‌లో కరోనా థర్డ్‌వేవ్ ఉధృతి పెరుగుతుండంతో ఈ సిరీస్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే రంజీ ట్రోఫీ, కల్నల్ సి కె నాయుడు ట్రోఫీ, సీనియర్ మహిళల టీ20 లీగ్‌తో సహా పలు దేశీయ టోర్నమెంట్‌లను బీసీసీఐ వాయిదా వేసింది. అయితే క్రికెట్.కామ్ నివేదిక ప్రకారం.. వెస్టిండీస్‌తో సిరీస్‌ను ఒకటి లేదా రెండు వేదికల్లో జరపాలని బీసీసీఐ భావిస్తోన్నట్లు సమాచారం. ఒక వేళ కరోనా ఉధృతి మరింత పెరిగినట్లయితే సిరీస్‌ను వాయిదా వేసిన ఆశ్చర్యపోనక్కరలేదు. కాగా ఫిబ్రవరి 6 న జరిగే తొలి వన్డేతో భారత్-వెస్టిండీస్ సిరీస్ మొదలు అవుతుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా వన్డేలకు ఆతిథ్యం ఇవ్వనుండగా, కటక్, విశాఖపట్నం, తిరువనంతపురం మూడు టీ2లు జరగనున్నాయి. "ఫిబ్రవరి మొదటి వారంలో కరోనా థర్డ్‌వేవ్ ఉధృతి మరింత పెరుగుతుంది. ఆరు వేదికల్లో మ్యాచ్‌లు నిర్వహించడం,బయో-బబుల్ ఏర్పాట్లు చేయడం చాలా కష్టం" అని బీసీసీఐ అధికారి ఒకరు పేర్కొన్నారు. అంతేకాకుండా వెస్టిండీస్ సిరీస్‌ను ప్రేక్షకులు లేకుండానే బీసీసీఐ నిర్వహించున్నట్లు సమాచారం.

## టీమిండియాకు భారీ షాక్.. మూడో టెస్టుకు స్టార్ బౌలర్ దూరం!

దక్షిణాఫ్రికాతో రెండో టెస్ట్ ఓటమి నుంచి కోలుకునే లోపే భారత్‌కు మరో భారీ షాక్. టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ గాయం కారణంగా మూడో టెస్ట్‌కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. జొహన్నెస్‌బర్గ్ వేదికగా జరిగిన రెండో టెస్ట్‌లో గాయపడిన సిరాజ్ ఇంకా కోలుకోనట్లు సమాచారం. ఈ క్రమంలో రెండో టెస్ట్ అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడిన భారత కోచ్ రాహుల్ ద్రవిడ్.. సిరాజ్ గాయంపై అప్‌డేట్ అందించాడు. "సిరాజ్ నెట్స్‌లో కష్టపడాలి. హామ్ స్ట్రింగ్ గాయం నుంచి వెంటనే కోలుకోవడం చాలా కష్టం.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190